E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 22-02-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:52|| పేజీలు–6 www.ekaburu.com



దిల్లీకి ఉగ్ర ముప్పు..
నిఘా వర్గాల హెచ్చరికలు » 3లో

## ఐదేళ్లలో చొరబాటుదారులను
# దేశం నుంచి తరిమేస్తాం

- చొరబాటుదారులతో అస్సాంకు ముప్పు
- చొరబాటుదారులపై చర్యలు తప్పవు..దేశం నుంచి పంపిస్తాం
- కాంగ్రెస్ కు దమ్ముంటే ఈ విషయాన్ని మేనిఫెస్టో లో పెట్టాలి ; అమిత్ షా
- శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్; అమిత్‌షా



**ఈ కబురు :**
నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు తరువాయి 6లో

## పరువు నష్టం కేసులో
# కోర్టుకు హాజరైన రాహుల్ గాంధీ

**ఈ కబురు**
: మహారాష్ట్ర లో నమోదైన ఓ పరువునష్టం కేసులో బెయిల్‌కు సంబంధించి కొత్త గ్యారంటీ దాఖలు చేయడానికి రాహుల్ గాంధీ శనివారం భివండీ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరయ్యారు. ఆ కేసులో కాంగ్రెస్ మహారాష్ట్ర చీఫ్ హర్షవర్ధన్‌ను తన కొత్త హామీదారుగా పేర్కొన్నారు. .... 2లో



# గోతులు... కుప్పలు... తిప్పలు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు
- మదీనగూడ, చందానగర్ వాసులకు నిత్యనరకం
- వరద నీటి కాలువ గుంతలు పూడ్చలేదు..
- సర్వీసు రోడ్డు ఊసెత్తడం లేదు...

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
“రహదారికి ఇరువైపులా మట్టి కుప్పలు... రెండు వైపులా వరద నీటి కాలువ కోసం తవ్వి అక్కడక్కడా వదిలేసిన గోతులు... పక్కనే ఉన్న కాలనీల వసూలు రోడ్డెక్కే వీలులేని పరిస్థితులు... సర్వీసు రోడ్డు పూర్తి కాకముందే రోడ్డుకు ఇరువైపులా ఇనుప ఫెన్సింగ్ అడ్డుగోడలు... కుంచించుకుపోయిన రహదారిపై యూ టర్నుల వద్ద వాహనదారుల అవస్థలు.. నెలల తరబడి నిలిచిపోయిన పనులతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు.. వెరసి అధికారుల నిర్లక్ష్యంతో నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న తిప్పలు.. ఇవీ జాతీయ రహదారి నెంబర్ 65 విస్తరణ పనుల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు..”

హైదరాబాద్‌మహారాష్ట్ర సరిహద్దును కలిపే ప్రధాన మార్గం జాతీయ రహదారి 65 విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. పనుల్లో సాగదీత, మధ్యలో నిలిచిపోయిన పనులు, ప్రణాళిక లేకుండా చేపట్టడం తదితర కారణాలతో ప్రజలు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. సగం చేపట్టి వదిలేసిన పనుల కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అసంపూర్తి రోడ్డుపై తీవ్ర ట్రాఫిక్ జామ్ లతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ముఖ్యంగా మాధినగూడ, చందానగర్ ప్రాంత ప్రజలు రోడ్డు ఎక్కేందుకు సైతం నిత్యం నరకం చూస్తున్నారు.



మధ్యలో నిలిచిన జాతీయ రహదారి విస్తరణ పనులు

తరువాయి 2లో

## డిగ్రీలు కాదు..
## పరిజ్ఞానం ముఖ్యం



- పరిశోధనకి యువత ప్రాధాన్యం ఇవ్వాలి
- మాతృ భాషని మరవద్దు
- తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి
- ఏఐని అదుపు చేసి ముందుకెళ్లాలి : వెంకయ్యనాయుడు

**ఈ కబురు, విజయవాడ**
: దేశాన్ని, మాతృ భాషని, చదువుకున్న విద్యా సంస్థని, గురువులని మరిచిపోకూడదని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. .... 2లో

## ప్రపంచ వేధికల్లో
# హుందాగా వ్యవహరించాలి

- అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడంపై కేటీఆర్ మండిపాటు
- ఇది దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని వ్యాఖ్య
- ఏఐ సమ్మిట్ వద్ద యూత్ కాంగ్రెస్ నిరసనలపై కేటీఆర్




**ఈ కబురు :**
ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 వేదిక వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన నిరసనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని అభివర్ణించారు. .... 2లో



# యుద్ధానికి సై
## పోరు బాటలో అమెరికా, ఇరాన్

**ఈ కబురు ;**
ఇరాన్ పక్షం రోజుల్లో దారికి రాకపోతే పోరు అనివార్యమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హూంకరిస్తున్నారు. పెంటగాన్ అధికారులైతే ఆదివారం నుంచే యుద్ధం ప్రారంభం కావచ్చన్న సంకేతాలినిస్తున్నారు. పోరు అనివార్యమైతే ఎదుర్కొవడానికి ఇరాన్ కూడా సిద్ధమంటోంది. ఈ నేపథ్యంలో యుద్ధానికి రెండు దేశాలు తమ సన్నాహాలను దాదాపు పూర్తి చేసుకున్నాయి!

**ముగిసిన మోహరింపు**
ఇరాన్ విషయంలో వెనెజువెలా తరహా వ్యూహాన్నే ట్రంప్ అనుసరిస్తున్నారు. వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురోను నిర్బంధించే ముందు కరీబియన్ తీరంలో యుద్ధ విమానాలు, నౌకలను మోహరించి ఆ దేశంపై ట్రంప్ ఒత్తిడి పెంచిన సంగతి తెలిసిందే. ఇరాన్‌పైనా దాదాపు అదే వ్యూహంతో అమెరికా ముందుకు వెళుతోంది. అందుకే టెహ్రాన్‌తో చర్చలు జరుపుతూనే కీలక రక్షణ వ్యవస్థలను పశ్చిమాసియాలో మోహరించింది. .... 2లో



## ట్రంప్ దూకుడుకు బ్రేకులేయించిన
# భారత సంతతి లాయర్ నీల్ కత్యాల్



**ఈ కబురు :**
తన, పర భేదం లేకుండా టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలను వణికించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుకు అగ్రరాజ్య సుప్రీంకోర్టు బ్రేక్ వేసింది. .... 3లో

## ఉద్యోగాల పేరిట సైబర్ మోసాలు చేయిస్తున్న
# ముఠా అరెస్టు

**ఈ కబురు, జగిత్యాల**
: యువకులను ఉద్యోగాల పేరిట లావోస్‌కు తీసుకెళ్లి వారితో సైబర్ మోసాలు చేయిస్తున్న నలుగురు నిందితులను జగిత్యాల పోలీసులు అరెస్టు చేశారు. .... 2లో






## ఈటల రాజేందర్ హౌస్ అరెస్టు

**ఈ కబురు, మేడ్చల్**
: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డితోపాటు పెద్ద ఎత్తున ఈటల నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయన్ను ఇంట్లోనే నిర్బంధించారు.

## వాణిజ్య ఒప్పందాలతో
# భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్త మార్కెట్



- రాయదుర్గం ఎఫ్ డీడీఐ స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి**
: భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో అభివృద్ధి చెందిన దేశాలతో చేసుకుంటున్న వాణిజ్య ఒప్పందాలతో భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్త మార్కెట్ లభిస్తుందని, భారతీయ ఉత్పత్తులను పోటీతత్వంతో తయారు చేస్తున్నాయని కేంద్ర గనుల శాఖమంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. రాయదుర్గంలోని లిడ్ క్యాప్ నైలెక్స్ క్యాంపస్ లో జరిగిన ఫుట్ వేర్ డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్ డీడీఐ) 5వ స్నాతకోత్సవ వేడుకలకు కిషన్ రెడ్డి శనివారం ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఫుట్ వేర్ రంగంలో సాంకేతికత మెరుగుదల కోసం ప్రభుత్వం 1700కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని, మేక్ ఇన్ ఇండియా కింద దేశీయ తయారీని మరింత బలోపేతం చేసేందుకు పిఎల్ఐ పథకాన్ని పరిశీలిస్తుందన్నారు. ఉత్తమ నైపుణ్యం. ఆవిష్కరణలు, ప్రపంచ వ్యాప్త పోటీతత్వంతో భారతీయ ఫుట్ వేర్, తోలు, ఫ్యాషన్, రీటైల్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేసే జాతీయ ఆస్థి ఎఫ్ డీడీఐ అని అన్నారు. .... 3లో

## కాంగ్రెస్‌లో ఏ లిస్టులూ ఉండవ్
# కేవలం మెరిట్ లిస్టే



- పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని తెలిపిన రేవంత్ రెడ్డి
- నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించాను
- అందరి కృషి వల్ల తెలంగాణలో పార్టీ పుంజుకుంది
- మనం కొట్లాడుకుంటే కార్యకర్తలకు అన్యాయం జరుగుతది
- మోతీలాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారు
- దేశం కోసం ప్రాణాలు అర్పించింది...గాంధీ కుటుంబం
- నేను పీసీసీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉండేది
- నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించాం; రేవంత్ రెడ్డి

**ఈ కబురు, అనంతగిరి:**
కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు.

ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. “ మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు.

తరువాయి 2లో



సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు
## హైదరాబాద్ సిటీ పోలీసుల సరికొత్త వ్యూహం

- క్రియేటర్లు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలి
- ‘జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్’ క్యాంపెయిన్‌లో నగర సిపి సజ్జనార్ పిలుపు

# గోతులు... కుప్పలు... తిప్పలు



మదీనగూడలో నిత్యం ట్రాఫిక్ జామ్ తో వాహనదారుల ఇబ్బందులు



మదీనగూడలో నిత్యం ట్రాఫిక్ జామ్ తో వాహనదారుల ఇబ్బందులు



రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్



ఎక్కడికక్కడ మట్టికుప్పలు, గుంతలతో సర్వీసు రోడ్డు



కాలనీల అంతర్గత రోడ్ల నుంచి ప్రధాన రహదారిపై కి వచ్చేందుకు అవస్థలు



ఎక్కడికక్కడ మట్టికుప్పలు, గుంతలతో సర్వీసు రోడ్డు

**రూ.1,400 కోట్లతో విస్తరణ పనులు..**

మియాపూర్సంగారెడ్డిని కలుపుతున్న జాతీయ రహదారి 65 విస్తరణలో భాగంగా మియాపూర్ నుండి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు 31 కి.మీ మేర నాలుగు వరుసలుగా ఉన్న రహదారిని 6 వరుసల రహదారిగా పనులు చేపట్టారు. సుమారు 1,400 కోట్ల వ్యయంతో 60 మీటర్ల వెడల్పుతో 3 వరుసల సర్వీస్ రోడ్ల నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. ప్రధాన క్యారేజ్‌వేతో పాటు సర్వీస్ రోడ్లు, ఫుట్‌పాత్, డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం పనులు ప్రారంభించి రహదారికి ఇరువైపులా వరద నీటి కాలువ కోసం తవ్వకాలు చేపట్టి, భారీ స్లాబులతో వరద నీటి కాలువ నిర్మాణం చేపట్టారు. దీంతో పాటు ప్రధాన క్యారేజ్‌వేకు, సర్వీస్ రోడ్డుకు మధ్యలో వరద నీటి కాలువకు అనుకొని ఇనుప ఫెన్సింగ్ పనులు చేపట్టారు.

**మధ్యలో నిలిచిన పనులతో ప్రజల ఇబ్బందులు...**

మదీనగూడ, చందానగర్ ప్రాంతాల్లో వరద నీటి కాలువ కోసం 6 నెలల క్రితం తవ్వకాలు చేపట్టిన అధికారులు పనులను పూర్తి చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తవ్విన గుంటల్లో అక్కడక్కడా స్లాబులు వేయకుండా వదిలి పెట్టడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం ఈ రహదారిపై ఎక్కడ ఎక్కడ గుంతలు ఉన్నాయో, ఎక్కడ రోడ్డు ఉందో, ఎక్కడ వరద కాలువ ఉందో తెలియని పరిస్థితి ఉంది. వరద కాలువ కోసం నిర్మించిన స్లాబ్ రోడ్డుకు ఎత్తుగా ఉండడంతో సమీప కాలనీల రోడ్ల నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వరద కాలువ కారణంగా చాలా వరకు కాలనీలను అనుసంధానం చేస్తున్న రోడ్లు మూసుకుపోయి, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల నుంచి తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ప్రణాళిక లేని పనులతో నిత్య నరకం...**

ప్రధాన క్యారేజ్‌వేకు పక్కన ఇరువైపులా వేసిన ఇనుప ఫెన్సింగ్ తో ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టకుండానే ఇనుప భారీకేడ్ ఏర్పాటు చేయడంతో కాలనీలకు వెళ్లే అంతర్గత రహదారులు మూసుకుపోయి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీసు రోడ్డులో ఎక్కడపడితే అక్కడ గుంతలు, మట్టికుప్పలు, వ్యర్థాలతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. పలు కాలనీల ప్రజలకు ప్రధాన రహదారి ఎక్కే దారులు మూసుకుపోయాయి. మదీనగూడలో అటు సర్వీసు రోడ్డు నిర్మాణం జరగక, ఇటు ఉన్న ప్రధాన రోడ్డు కుంచించుకుపోయి యూ టర్నుల వద్ద స్కూల్ బస్సులు, భారీ వాహనాలు తిరిగేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. దీని కారణంగా నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతంలో తీవ్ర ట్రాఫిక్ జామ్ అవుతుంది. రహదారి మీద వేసిన రోడ్డు డివైడర్ కోసం వదిలిపెట్టడం వాహనదారులను ప్రమాదాల్లోకి నెడుతుంది.

## కాంగ్రెస్‌లో ఏ లిస్టులూ ఉండవ్
# కేవలం మెరిట్ లిస్టే



నేతలందరినీ కలిసి నా ఆలోచన చెప్పి.. అందర్నీ ఒప్పించాను. అందరం కృషి చేయడంతో పార్టీ ఓటింగ్ పెరిగింది. డీసీసీ అధ్యక్షులుగా బాగా పని చేసిన వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చాం. ఎమ్మెల్యే టికెట్లు పొందలేని వారికి ఎమ్మెల్సీలు ఇచ్చాం. పార్టీ కోసం కృషి చేసిన మరో 60 మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుంది. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చు'' అని రేవంత్ రెడ్డి అన్నారు.

## ప్రపంచ వేదికల్లో
# హుందాగా వ్యవహరించాలి



అంతర్జాతీయ సదస్సులు దేశ ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించే వేదికలని అన్నారు. ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని చెప్పారు. రాజకీయ విభేదాలు సహజమే అయినా... అభిప్రాయ భేదాలను వ్యక్తపరచడానికి సరైన సమయం, సరైన వేదిక ఉండాలని కేటీఆర్ అన్నారు. గ్లోబల్ ఈవెంట్‌లలో ఇలాంటి నిరసనలు చేపట్టడం వల్ల భారత్‌పై అంతర్జాతీయంగా ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని విమర్శించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేయడం చాలా విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు.

## పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరైన రాహుల్ గాంధీ



ఈ కేసులో ఇప్పటి వరకు గ్యారంటర్‌గా ఉన్న కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ గతేడాది డిసెంబర్ 12న మరణించారు. దీంతో ఆయన స్థానంలో కొత్త హామీదారు పేరును నమోదు చేయాల్సిందిగా న్యాయస్థానం రాహుల్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలోని సోనాలే గ్రామంలో జరిగిన ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అక్కడ ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ హత్య వెనుక ఆర్ఎస్ఎస్ హస్తం ఉందని ఆరోపించారు. ఆయన ప్రసంగం ఆర్ఎస్ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని పేర్కొంటూ.. అప్పట్లో సంఘ్ కార్యకర్త రాజేష్ కుంటే భివండీ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

# యుద్ధానికి సై



--యూఎస్ఎస్ అబ్రహం లింకన్: ఈ విమాన వాహక నౌక ప్రస్తుతం అరేబియా సముద్రంలో ఉంది. దీన్ని దక్షిణ చైనా సముద్రం నుంచి పశ్చిమాసియాకు ట్రంప్ తరలించారు. ఇందులో ఎనిమిది స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలు ఉంటాయి.

--యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్.ఫోర్డ్: ప్రపంచంలోనే అతి పెద్ద విమాన వాహక నౌక. కరీబియన్ సముద్రం నుంచి ఇది పశ్చిమాసియాకు బయల్దేరింది. ఈ నౌకతో పాటు.. 5 వేల మంది సిబ్బంది ఇరాన్ తీరానికి చేరనున్నారు. తొమహాక్ క్షిపణులతో కూడిన ఐదు రక్షణ నౌకలు కూడా ఈ విమాన వాహక నౌకతో పాటు వస్తున్నాయి.

--జలాంతర్గాములు: గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్లు, జలాంతర్గాములను ఇప్పటికే అమెరికా మోహరించింది. ఇవి దాడి చేయడానికి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయి.

--ఫైటర్ జెట్‌లు: ఇటీవల కాలంల 50కి పైగా అదనపు ఎఫ్35, ఎఫ్22, ఎఫ్16 జెట్‌లు పశ్చిమాసియాలోని వివిధ సైనిక స్థావరాల్లో అగ్రరాజ్యం మోహరించింది. డజన్ల కొద్దీ కేసీ35, కేసీ46 రీఫ్యూయలింగ్ ట్యాంకర్లనూ రంగంలోకి దింపింది. సుదీర్ఘ శ్రేణి దాడులకు ఈ ట్యాంకర్లు చాలా కీలకం.

--బి2 స్టెల్త్ బాంబర్లు: గత ఏడాది జూన్‌లో ఇరాన్ అణుకేంద్రాలను ధ్వంసం చేయడానికి ఈ బాంబర్లనే అమెరికా వినియోగించింది. ఆ సమయంలో ఇవి మిసోరి నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇరాన్‌పై విరుచుకుపడ్డాయి. ఈసారి డియాగో గార్షియా నుంచి వీటిని ఆపరేట్ చేయాలని అమెరికా భావిస్తోంది. అయితే ఇందుకు బ్రిటన్ అంగీకరించడం లేదు.

--గగనతల రక్షణ వ్యవస్థలు: ఇరాన్ బాలిస్టిక్ మిసైళ్లను ఎదుర్కొవడానికి పేట్రియాట్, థాడ్.. క్షిపణి రక్షణ వ్యవస్థలను రంగంలోకి దించింది. వీటిని సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈల్లో మోహరించింది.

--దీటుగా స్పందిస్తున్న టెహ్రాన్

ఇరాన్ కూడా అమెరికా దాడి చేయడం అనివార్యమని భావిస్తోంది. అమెరికా షరతులకు అంగీకరించి ఒప్పందాన్ని కుదుర్చుకుంటే యురేనియం శుద్ధిని ఆపేయాలి. బాలిస్టిక్ క్షిపణుల సంఖ్యను తగ్గించుకోవాలి. వీటికి అంగీకరించడం కంటే స్వల్పకాలిక యుద్ధమే వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని టెహ్రాన్ భావిస్తోంది. అందుకు తగ్గట్టే తన రక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేసుకుంటోంది. గతేడాది జూన్‌లో జరిగిన 12 రోజుల యుద్ధంలో ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేశాయి. ఆ పోరులో పలు క్షిపణి కేంద్రాలను, వైమానిక స్థావరాలను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. వీటికి పూర్తిస్థాయిలో ఇరాన్ మరమ్మతులు చేసింది. అణుకేంద్రాల భద్రతపై ఇరాన్ ఎక్కువగా దృష్టి సారించింది. ఎందుకంటే జూన్‌లో జరిగిన యుద్ధంలో ఇరాన్‌లోని మూడు అణుకేంద్రాలపై అమెరికా భారీస్థాయిలో బాంబుల వర్షం కురిపించింది. ఈసారి అటువంటి పరిస్థితులు తలెత్తకుండా ఇరాన్ తన గగనతల రక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేసుకుంది. అణుకేంద్రాల దగ్గర భద్రతనూ పెంచింది. ముఖ్యంగా శుద్ధి చేసిన యురేనియం నిల్వల పరిరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటోంది. సాయుధ దళాల్లోకి విశ్రాంత సైనికులను తీసుకొనే కార్యక్రమం ప్రారంభించింది. భారీస్థాయిలో క్షిపణులను ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఇరాన్‌కు ఉంది. గతేడాది జూన్‌లో జరిగిన యుద్ధంలో ఈ ఉత్పత్తి కేంద్రాలను పూర్తిస్థాయిలో ధ్వంసం చేయడంలో అమెరికా, ఇజ్రాయెల్ విఫలమయ్యాయి. అందుకే ఇరాన్‌తో జరిగిన అణు చర్చల్లో బాలిస్టిక్ క్షిపణుల అంశాన్ని అగ్రరాజ్యం తెరపైకి తీసుకొచ్చింది. వీటి సంఖ్యను పరిమితం చేసుకోవాలని షరతు పెట్టింది. ఇందుకు ఇరాన్ అంగీకరించలేదు. 12 రోజుల యుద్ధంలో ఇరాన్‌కు చెందిన 30 మంది జనరళ్లను, 19 మంది అణు శాస్త్రవేత్తలను హతమార్చాయి. అంతేకాదు..యుద్ధ సమయంలో సైనికాధికారులు ఎప్పటికప్పుడు సుప్రీం నేత అలీ ఖమేనీతో సంప్రదించడం కష్టమైంది. దీన్నుంచి పాఠాలు నేర్చుకున్న ఇరాన్ కొత్తగా జాతీయ భద్రతా మండలిని ఏర్పాటు చేసింది. అత్యవసర సమయాల్లో నిర్ణయం తీసుకొనే అధికారం స్థానిక గవర్నర్లకు ఇచ్చింది. అంతేకాదు.. ఇజ్రాయెల్ నిఘా సంస్థలు దేశంలో చొరబడకుండా కఠిన చర్యలు తీసుకుంది. దేశద్రోహులపై గట్టిగా నిఘా పెట్టింది. దాదాపు 21 వేల మంది పౌరులను నిర్బంధంలోకి తీసుకుంది.

## డిగ్రీలు కాదు..
# పరిజ్ఞానం ముఖ్యం



ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ''పరిశోధనకి యువత ప్రాధాన్యం ఇవ్వాలి. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. మన పూర్వీకులు మనకి అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలి. మన కట్టు, బొట్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి. తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి. భారత్ విశ్వగురువు అయినా.. వేరే దేశం మీద దండయాత్రలు చేయలేదు. కులం కన్నా.. గుణం మిన్న. భారత్ సత్తా ప్రపంచ వేదికల మీద చాటి చెబుతున్నారు. డిగ్రీలు కాదు పరిజ్ఞానం ముఖ్యం. ముఖ్యమంత్రి చంద్రబాబు టెక్నాలజీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏఐని అదుపుచేసి ముందుకువెళ్లాల్సిన అవసరం ఉంది. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోనన్న భయం నాకు ఉంది. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చెయ్యాలి. సోషల్ మీడియా తప్పుడు అంశాలకు వేదికైంది. భావితరాలను మంచి మార్గంలో నడపాలి. భవిష్యత్‌లో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోతాయి. దీనికోసం మాట్లాడాల్సిన అవసరం ఉంది. దీనిపై చర్చించాలి. రాజకీయ నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారు. గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వాళ్లంతా ఓడిపోయారు. వ్యవస్థలో అలాంటి వ్యక్తులను ప్రోత్సహించకూడదు. సమాజం అలాంటి వాళ్లని బహిష్కరించాలి. రామాయణాన్ని పాఠ్య పుస్తకాల్లో పొందుపరచాలి. తల్లిదండ్రులు, పెద్దలు పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలి. గూగుల్‌కి ప్రాధాన్యం తగ్గించి.. బుర్రకి పని చెప్పాలి. మంచి సమాజ నిర్మాణానికి మనందరం కృషి చేయాలి'' అని వెంకయ్యనాయుడు అన్నారు.

## ఈటల రాజేందర్
# హౌస్ అరెస్టు



కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిమీద దాడి నేపథ్యంలో ఆయన్ని పరామర్శించేందుకు ఈటల రాజేందర్ కామారెడ్డి బయల్దేరారు. ఈ క్రమంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈటలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఈటల తీవ్రంగా ఖండించారు. గుండాయిజం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## ఉద్యోగాల పేరిట సైబర్ మోసాలు
# చేయిస్తున్న ముఠా అరెస్టు




శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని మల్లాపూర్ మండలం ఓబులాపూర్ తండాకు చెందిన ఇస్లావత్ విజయేందర్ అలియాస్ ఆంధ్రూ, సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన మీసాల రాజశేఖర్, రంగపేటకు చెందిన దండగుల కల్యాణ్, ధర్మపురికి చెందిన శ్యాంరావు రాజశేఖర్, ఏపీలోని వైజాగ్‌కు చెందిన రాజు ముఠాగా ఏర్పడ్డారు. లావోస్‌లో ఉద్యోగాల పేరిట ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చాలామందిని నమ్మించి డబ్బులు తీసుకున్నారు. వారిని బ్యాంకాక్, థాయ్‌లాండ్ ద్వారా లావోస్‌కు తీసుకెళ్లి అక్కడ చైనా కంపెనీ ఆధ్వర్యంలో సైబర్ మోసాలు చేయిస్తున్నారు. బాధితుల్లో ఒకరైన జగిత్యాల గ్రామీణ మండలం మోరపల్లికి చెందిన కేశవతుల అరవింద్ అక్కడి నుంచి వచ్చి గతేడాది మార్చి 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇస్లావత్ విజయేందర్‌కు లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 16న అతను లావోస్ నుంచి శంషాబాద్ విమానాశ్రయంలో దిగగా సైబర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జగిత్యాలకు తీసుకొచ్చి విచారించగా చాలామంది వద్ద రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకొని లావోస్‌కు తీసుకెళ్లినట్లు తేలింది. విశాఖకు చెందిన రాజు లావోస్‌లోనే ఉండగా.. మిగతా నలుగురిని అరెస్టు చేసి రిమాండుకు పంపించినట్లు ఎస్పీ చెప్పారు.

## సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు
# హైదరాబాద్ సిటీ పోలీసుల సరికొత్త వ్యూహం

ఈ కబురు, హైదరాబాద్ : సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. కేవలం అధికారిక హెచ్చరికలకే పరిమితం కాకుండా, సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యే రీతిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్, ఐపిఎస్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న 'జాగృత్ హైదరాబాద్ సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ నూతన విధానానికి విశేష స్పందన లభిస్తోంది. పోలీసుల పిలుపు మేరకు పలువురు ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సైబర్ నేరాల తీరుతెన్నులను వివరిస్తూ తమదైన శైలిలో వీడియోలు రూపొందిస్తున్నారు. వీటిని హైదరాబాద్ సిటీ పోలీస్, సిపి విసి సజ్జనార్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలతో 'కొలాబరేట్' చేయడం ద్వారా లక్షలాది మందికి చేరువ చేస్తున్నారు. వినోదాత్మకంగా ఉంటూనే, అత్యంత కీలకమైన సైబర్ భద్రతా సూచనలను ఈ వీడియోలు ప్రజలకు అందిస్తున్నాయి.

## వాణిజ్య ఒప్పందాలతో
# భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్త మార్కెట్



సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

నేడు ప్రపంచంలో భారతీయ పుట్ వేర్ మార్కెట్ 26 నుంచి 30 బిలియన్లతో రెండవ అతిపెద్ద మార్కెట్ ను కలిగి ఉందన్నారు. ఈ రంగంలో దాదాపు 4.5 మిలియన్ల మందికి ఉపాది అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. భారతీయ ఫుట్ వేర్ రంగం మన ఎంఎస్ఎంఈ, చేతివృత్తుల బలాన్ని ప్రతిభింబిస్తుందని పేర్కొన్నారు. సామర్థ్యాన్ని పెంచుతూ ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించే విధంగా సింగిల్ విండో ప్లాట్ ఫామ్ అయిన వన్ ఎఫ్డిఐ సర్వీసు కాంపెండియంను ఆవిష్కరించినందుకు ఎఫ్ డీడీఐని అభినందించారు. నేడు దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకువెళ్తుందని తెలిపారు. తాజాగా జరిగిన ఏఐ గ్లోబల్ సమ్మిట్లో 20కంటే ఎక్కువ దేశాధినేతలు, 100కంటే ఎక్కువ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారని, భారత్ ను విశ్వసనీయ, బాధ్యతాయుతమైన సాంకేతిక నాయకుడిగా ప్రపంచం గుర్తిస్తుందన్నారు. భారతదేశం ఇకపై సాంకేతికతను స్వీకరించడమే కాకుండా దాని భవిష్యత్తును మారుస్తుందని తెలిపారు. సాంకేతికతను, ఏఐని యువత బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో లీడ్ క్యాప్ ప్రతినిధులతో పాటు లెథర్ ఇండస్ట్రీ అధికారులు, ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మల్లన్న గుడి నిర్మాణ పనులను పరిశీలించిన ఆంజనేయులు సాగర్



ఆంజనేయులు సాగర్ తో కలిసి ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు

**○ ఘనంగా సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు**

ఈకబురు, శేరిలింగంపల్లి : అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్‌లో కొనసాగుతున్న మల్లన్న గుడి నిర్మాణ పనులను అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఏం.ఆంజనేయులు సాగర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులతో కలిసి దేవాలయం మొత్తం కలియతిరిగి నిర్మాణ పనులను పరిశీలించిన ఆంజనేయులు సాగర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఆధ్యాత్మికతకు, సాంప్రదాయ విలువలకు కేంద్రం అయిన దేవాలయం అంజయ్య నగర్ డివిజన్ లో నిర్మించడం మనందరి గౌరవపరమైన బాధ్యత అని పేర్కొన్నారు, నిర్మాణ పనులకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లన్న గుడి కమిటీ అధ్యక్షులు బసవరాజు, సిద్దిక్ నగర్ కాలనీ అధ్యక్షులు తిరుపతి రెడ్డి, జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, నాయకులు యాదయ్య గౌడ్, గోపాల్ గౌడ్, సంతోష్, రాము యాదవ్, రాము, సాగర్, ఆనంద్ లతో పాటు కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి యువత క్రీడల్లోనూ సత్తా చాటాలి: రాగం హరిశంకర్ యాదవ్



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న హరి శంకర్ యాదవ్



వివిధ జట్ల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**○ ఆర్ ఎల్ వై ట్రస్టు ఆధ్వర్యంలో గౌలిదొడ్డిలో క్రికెట్ టోర్నమెంట్**

ఈకబురు, శేరిలింగంపల్లి : నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి లో ఆర్.ఎల్.వై. వస్తాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ను ఘనంగా ప్రారంభించారు. నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం హరిశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ ను 8 ఓవర్లకు ఇన్నింగ్స్ చొప్పున నిర్వహిస్తున్నారు. శనివారం నాలుగు మ్యాచ్ లు నిర్వహించగా హరిశంకర్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై టాస్ వేసి మ్యాచ్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిశంకర్ యాదవ్ మాట్లాడుతూ నేటి యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలతో శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ముఖ్యంగా మన దేశంలో క్రికెట్ ను అమితంగా ప్రేమిస్తారని, ప్రాంతాలు, మతాలకు అతీతంగా కలిసికట్టుగా క్రికెట్ అడుతారని అన్నారు. శనివారం విజేతలుగా నిలిచిన జట్లు ఆదివారం సెమీఫైనల్, ఫైనల్ పోటీల్లో పోటీ పడుతారని అన్నారు. క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొంటున్న జట్లకు హరిశంకర్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

## మన క్రీడాకారులు ప్రపంచ వేదికలపై
# త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్నారు: రామచందర్‌రావు



ఈ కబురు, హైదరాబాద్: క్రీడల్లో యువత రాణించేలా ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించిన పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో స్థానిక ఎంపీల ద్వారా ఈ క్రీడా కార్యక్రమం చేపట్టారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రీడా స్ఫూర్తిని నింపేలా కృషి చేశామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. ప్రపంచ వేదికలపై భారతీయ త్రివర్ణ పతాకాన్ని మన క్రీడాకారులు ఎగురవేస్తున్నారని వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులతో ప్రధాని మోదీ మాట్లాడి.. వెన్నుతట్టి ప్రోత్సహిస్తారన్నారు. గెలిచాక వారిని స్వయంగా కలిసి అభినందిస్తారని గుర్తుచేశారు. ప్రధాని చేపట్టిన పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా లక్షలాది మంది యువత పాల్గొన్నారని మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు అన్నారు. అత్యధిక యువత ఉన్న దేశం మన భారత్ అని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా రంగాల్లో మన యువత ప్రాతినిధ్యం వహిస్తున్నారని వివరించారు. గెలిచినా, ఓడినా ప్రతి సంవత్సరం ఇలాంటి పోటీల్లో యువత పాల్గొనాలని సూచించారు.

## ట్రంప్ దూకుడుకు బ్రేకులేయించిన
# భారత సంతతి లాయర్ నీల్ కత్యాల్



ఆ సుంకాలేవీ చెల్లవంటూ సంచలన తీర్పు వెలువరించింది. ఈ తీర్పు రావడంలో భారత సంతతి న్యాయవాది నీల్ కత్యాల్ కీలక పాత్ర పోషించారు. ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన చిన్న వ్యాపారులు, డెమోక్రాట్ పాలిత రాష్ట్రాల కూటమి తరపున ఆయన సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ఈ టారిఫ్‌ల కోసం ట్రంప్ 1977 నాటి అంతర్జాతీయ అత్యాయిక ఆర్థిక అధికారాల చట్టాన్ని (ఐఈఈపీఏ) ఉపయోగించడానికి వ్యతిరేకంగా నీల్ కత్యాల్ సుప్రీంకోర్టులో వాదించారు. ప్రతి వాణిజ్య భాగస్వామి పైనా సుంకాలు విధించడం అన్యాయమని, అది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. సుప్రీంతీర్పు అనంతరం నీల్ మాట్లాడుతూ.. ‘‘ఈ రోజు అమెరికా సుప్రీంకోర్టు చట్టపరమైన పాలన, అమెరికన్ ప్రజల భద్రత కోసం నిలబడింది. అధ్యక్షులు శక్తిమంతులే.. కానీ రాజ్యాంగం మరింత శక్తిమంతమైనదని న్యాయస్థానం నిరూపించింది. ప్రాథమిక విలువలను కాపాడింది. ఈ తీర్పు ఓ మైలురాయిగా నిలవనుంది’’ అని ఆనందం వ్యక్తం చేశారు.

**——ఎవరీ నీల్ కత్యాల్..**

నీల్ కత్యాల్ షికాగోలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వచ్చిన వలసదారులు. తల్లి ప్రతిభ వైద్యురాలు. తండ్రి సురేందర్ ఇంజినీర్‌గా పనిచేశారు. యేల్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నీల్.. కెరీర్ తొలినాళ్లలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్టీఫెన్ బ్రేయర్ వద్ద క్లర్క్‌గా పనిచేశారు. 2010లో నాటి అమెరికా అధ్యక్షుడు ఒబామా హయాంలో యూఎస్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. ఇప్పటివరకు అమెరికా సుప్రీంకోర్టులో 50కి పైగా కేసులు వాదించారు. గతంలో పలుమార్లు ట్రంప్ (Donald Trump) విధానాలకు వ్యతిరేకంగా నీల్ న్యాయస్థానాల్లో వాదించిన సందర్భాలు ఉన్నాయి. 2017లో ట్రంప్ తొలిసారి అధికారంలో కొన్ని దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలకు వ్యతిరేకంగా నమోదైన కేసులను నీల్ వాదించారు. ‘ఇంపీచ్: ది కేస్ అగైనెస్ట్ డొనాల్డ్ ట్రంప్’ అనే పుస్తకాన్ని కూడా రచించారు. సంచలనం సృష్టించిన ఆఫ్రికన్ అమెరికన్ జార్జ్ ఫ్లాయిడ్ హత్య కేసులో మిన్నెసోటా రాష్ట్రం తరపున ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా వాదించారు. అమెరికా న్యాయవిభాగం నుంచి అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్నారు.

## దిల్లీకి ఉగ్ర ముప్పు..
# నిఘా వర్గాల హెచ్చరికలు



ఈ కబురు : దేశ రాజధానిలో ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దిల్లీలోని ఎర్రకోట , చాందినీ చౌక్ ప్రాంతంలోని ఆలయాల వద్ద దాడులు చేసేందుకు పాక్‌కు చెందిన ఉగ్ర సంస్థ లష్కరే తయ్యిబా ప్లాన్ చేసినట్లు తెలిపాయి. ఇందుకు భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను వినియోగించే అవకాశం ఉందన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ నగరాల్లో రద్దీగా ఉండే ప్రదేశాల్లోనూ దాడులు జరిగే అవకాశం ఉందన్నారు. దీంతో అప్రమత్తమైన భద్రతా సంస్థలు దిల్లీలో హైఅలర్ట్ ప్రకటించాయి. సున్నితమైన ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని మోహరించాయి. బాంబ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని పోలీసులు స్థానికులను కోరారు. గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో.. నిఘా వర్గాల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. దిల్లీ సహా ఇతర ప్రముఖ నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు.

## ప్రియుడితో కలిసి
# భర్తను హత్య చేసిన భార్య

ఈ కబురు, చేవెళ్ల : తెలంగాణలోని చేవెళ్లలో చర్చనీయాంశమైన కృష్ణ అనే వ్యక్తి హత్య కేసును పోలీసులు ఛేదించారు. అతడి భార్య, ఆమె ప్రియుడు కలిసి కృష్ణ నిద్రిస్తున్న సమయంలో శ్వాస ఆడకుండా దిండుపెట్టి హత్య చేసినట్లు తేల్చారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామానికి చెందిన నారగూడం కృష్ణ(35) జీడిమెట్లకు చెందిన రాజేశ్వరిని 2018లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. చేవెళ్లలోని చంద్రారెడ్డినగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ ఇద్దరూ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజశ్వేరికి ఆరు నెలల క్రితం శరత్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి. దీంతో రాజేశ్వరి కొద్ది రోజులు శరత్‌ను దూరం పెట్టింది. బాగా చూసుకుంటానని శరత్ ఆమెను నమ్మించాడు. దీంతో ఇద్దరూ ఎలాగైనా కృష్ణ అడ్డు తొలగించుకోవాలని నిశ్చయించుకున్నారు. గురువారం రాత్రి మద్యం తాగి వచ్చిన భర్తతో రాజేశ్వరి గొడవపడింది. అనంతరం నిద్ర పోయాక ప్రియుడికి ఫోన్ చేసి రప్పించింది. ప్రియుడితో కలిసి కాళ్లు చేతులు కట్టి ముఖంపై దిండు పెట్టి శ్వాస ఆడకుండా చేయడంతో పాటు ఛాతీపై బలంగా కొట్టారు. కృష్ణ మృతి చెందాడని నిర్ధారించుకున్న తర్వాత శరత్ వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం భర్త పలకడం లేదని ఆటోను రప్పించుకొని ఆసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందాడని చెప్పడంతో ఆమె తమ్ముడికి ఫోన్ చేసి చెప్పింది. అతడు కృష్ణ తల్లి అంజమ్మకి ఫోన్ చేసి చెప్పడంతో ఆమె వచ్చి రాజేశ్వరిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని రాజేశ్వరిని విచారించగా అసలు విషయం బయటపడింది. ఆమె ప్రియుడిని అదుపులోకి తీసుకొని ఇద్దరినీ శనివారం రిమాండ్‌కి తరలించినట్లు సీఐ తెలిపారు.

# కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



ఈ కబురు, కామారెడ్డి: కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి కారును భాజపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

# భారీ పెట్టుబడులు..'ఏఐ' తీర్మానంపై 86 దేశాల సంతకాలు



దిల్లీ వేదికగా నిర్వహించిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' విజయవంతమైందని, ప్రపంచ దేశాల నుంచి బలమైన మద్దతు లభించిందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. సదస్సు (AI Impact Summit) తీర్మానంపై 86 దేశాలతోపాటు రెండు అంతర్జాతీయ సంస్థలు సంతకం చేసినట్లు తెలిపారు. అమెరికా, బ్రిటన్, కెనడా, చైనా, డెన్మార్క్, జర్మనీ తదితర దేశాలు సంతకం చేసినవాటిలో ఉన్నాయని చెప్పారు.

"ప్రధాని మోదీ (PM Modi) 'ఏఐ' దార్శనికతను ప్రపంచం ఆమోదించింది. 'అందరికీ సంక్షేమం.. అందరికీ ఆనందం' అనే సూత్రాలను సమర్థించింది. ఏఐ సౌకర్యాలు, సేవలు, సాంకేతికత అనేవి ప్రతి ఒక్కరికీ చేరేలా కృత్రిమ మేధ వనరులను అందుబాటులో ఉంచేందుకు ప్రపంచ దేశాలు అంగీకరించాయి" అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ (Ashwini Vaishnaw) మీడియా సమావేశంలో చెప్పారు. ఏఐ దార్శనికతలో.. ఆర్థిక వృద్ధిని సమాజ హితంతో సమతుల్యం చేయడానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు.

ఈ సదస్సులో 5 లక్షల మందికిపైగా సందర్శకులు పాల్గొన్నారని కేంద్రమంత్రి తెలిపారు. సరికొత్త ఏఐ (Artificial Intelligence) యుగంలో భారత్ పోషిస్తున్న పాత్రపై ప్రపంచ దేశాల విశ్వాసాన్ని ఈ సమిట్ ప్రతిబింబించిందన్నారు. ఈ సదస్సు ద్వారా మౌలిక సదుపాయాల రంగంలో 250 బిలియన్ డాలర్లకుపైగా, డీప్‌టెక్ రంగంలో 20 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులకు హామీలు లభించాయని ఇప్పటికే వెల్లడించిన విషయం తెలిసిందే.

## ట్రంప్ టారిఫ్‌లు రద్దు..
# కేంద్రం నుంచి ఫస్ట్ రియాక్షన్



: ప్రపంచ దేశాలపై విధించిన సుంకాల విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు (Donald Trump tariff policy) అక్కడి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కేంద్రం నుంచి స్పందన వచ్చింది. అమెరికా సుప్రీం కోర్టు తీర్పును, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) స్పందనను విశ్లేషిస్తున్నామని వాణిజ్య శాఖ అధికారిక ప్రకటనలో పేర్కొంది. "సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మేం పరిశీలిస్తున్నాం. ఆ తీర్పు తర్వాత అధ్యక్షుడు మీడియాతో మాట్లాడారు. అమెరికా యంత్రాంగం కొన్ని చర్యలను ప్రకటించింది. వాటి పర్యవసానాలు ఎలా ఉండొచ్చనే దానిపై విశ్లేషిస్తున్నాం" అని పేర్కొంది.

టారిఫ్‌ల తీర్పును స్వాగతించిన మెక్రాన్

టారిఫ్‌లపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ (Emmanuel Macron) స్వాగతించారు. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని నియంత్రించే శక్తి మంచిదేనని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే.. సుప్రీం తీర్పుపై ఆగ్రహం వ్యక్తంచేసిన ట్రంప్.. ప్రపంచ దేశాలపై మళ్లీ 10శాతం టారిఫ్‌లు (Trump Tariffs) విధించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఈ టారిఫ్‌లు ఫిబ్రవరి 24 నుంచి అమల్లోకి వస్తాయని వైట్ హౌస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. అవి 150 రోజుల పాటు అమల్లోకి అమల్లో ఉంటాయని తెలిపింది. మరోవైపు, భారత్‌అమెరికా మధ్య మధ్యంతర ట్రేడ్‌డీల్ ఖరారైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో భారత్‌పై 18 శాతం సుంకాలు ఉంటాయని ట్రంప్ ప్రకటించారు. అయితే అవి ఇప్పుడు 10 శాతానికి దిగిరానున్నాయి.

# వారం రోజుల్లో పసిడి జంప్.. ఎంతలా పెరిగిందంటే?



బంగారం, వెండి ధరలు కొంత కాలంగా పెరుగుతూ, తగ్గుతూ ముందుకు సాగుతున్నాయి. ఈ వారం (ఫిబ్రవరి 15 నుంచి ఫిబ్రవరి 21) రోజుల్లో గోల్డ్ రేటులో గణనీయమైన మార్పు ఏర్పడింది. ఈ కథనంలో ఏడు రోజుల్లో పసిడి ధరలు ఎంతలా మారాయనే విషయాలు తెలుసుకుందాం. హైదరాబాద్, విజయవాడలలో ఫిబ్రవరి 15న 1,57,750 రూపాయల వద్ద ఉన్న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రేటు శనివారం నాటికి (ఫిబ్రవరి 21) 1,59,280 రూపాయల వద్దకు చేరింది. అంటే వారం రోజుల్లో 1530 రూపాయలు పెరిగిందన్న మాట. 22 క్యారెట్ల గోల్డ్ రేటు వారం రోజుల్లో 1,44,600 నుంచి 1,46,000 వద్దకు (రూ.1400 పెరిగింది) చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల తులం గోల్డ్ రేటు వారం రోజుల్లో 1,57,900 రూపాయల నుంచి రూ. 1,59,430 వద్దకు (రూ.1530 పెరిగింది) చేరింది. 22 క్యారెట్ల ధర 1,44,750 రూపాయల నుంచి రూ. 1,46,150 వద్దకు (1400 రూపాయలు పెరిగింది) చేరింది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు 1,58,840 రూపాయల నుంచి 1,60,150 రూపాయల వద్దకు చేరింది. 22 క్యారెట్ల రేటు 1,45,600 రూపాయల నుంచి రూ. 1,46,800 వద్దకు (రూ. 1200 పెరిగింది) చేరింది.

### వెండి ధరలు

**బంగారం మాదిరిగానే వెండి ధరలు కూడా మారాయి. గత ఆదివారం (ఫిబ్రవరి 15) రూ. 2.80 లక్షల వద్ద ఉన్న సిల్వర్ రేటు.. ఈ రోజుకు (శనివారం) పెరుగుతూ.. తగ్గుతూ.. రూ. 2.90 లక్షలకు చేరింది.**

# ట్రంప్ టారిఫ్‌లు రద్దు.. భారతీయులకు రీఫండ్ వస్తుందా?



భారత్ సహా ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన టారిఫ్‌లు చెల్లవని అమెరికా సుప్రీంకోర్టు తేల్చేసింది. మరి ఇప్పటివరకు చెల్లించిన సుంకాల మాటేంటీ? ఇప్పుడు అందరిలో మెదిలే ప్రశ్న ఇదే..! ఈ విషయాన్ని కోర్టు కూడా తన తీర్పులో స్పష్టం చేయకపోయేసరికి దీనిపై గందరగోళం నెలకొంది. మరి టారిఫ్‌ల (Trump Traiffs) పేరుతో గతేడాది నుంచి అగ్రరాజ్యం వసూలుచేసిన సొమ్మును తిరిగిచ్చేస్తారా? ఒకవేళ అలా చేస్తే భారత ఎగుమతిదారులకు రీఫండ్ ఏమైనా వస్తుందా? ఈ తీర్పుతో భారతీయ కంపెనీలకు (Indian Exporters) ఊరట లభించనుందా?

**ఖజానాకు రూ.12లక్షల కోట్లు**

గతేడాది ట్రంప్ (Donald Trump) అధికారంలోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ 2న ప్రపంచదేశాలపై ఈ ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. నాటినుంచి డిసెంబరు మధ్య వరకు దిగుమతిదారుల నుంచి అదనపు సుంకాలు వసూలుచేయడం ద్వారా అమెరికా (USA) ఖజానాకు 13,300 కోట్ల డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.12 లక్షల కోట్లు) చేరాయని అంచనా. ఈ మొత్తాన్ని ఆయా కంపెనీలకు తిరిగి చెల్లించాలా, వద్దా అనే విషయాన్ని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేయలేదు. అయితే, ఇప్పటికే చాలా కంపెనీలు దీనిపై దిగువ కోర్టులను ఆశ్రయించాయి. కాస్ట్‌కో, రెవ్లాన్, బంబుల్ బీ ఫుడ్స్ వంటి కంపెనీలు రీఫండ్‌ల కోసం పిటిషన్లు దాఖలు చేశాయి.

**చెల్లింపులు కంపెనీలకే..!**

ట్రంప్ భారీ సుంకాలతో (Trump Tariffs) భారత ఎగుమతిదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా కొన్ని పరిశ్రమలకు అగ్రరాజ్యం నుంచి వచ్చే మార్కెట్ వాటా తగ్గింది. అయితే, తాజా తీర్పుతో భారత ఎగుమతిదారులకు ఎలాంటి రీఫండ్ దక్కే అవకాశాలు లేవు. ఎందుకంటే ఈ టారిఫ్‌లను చెల్లించింది అమెరికాలోని దిగుమతిదారులే. ఒకవేళ సొమ్ము వెనక్కిచ్చేస్తే అది ఆయా కంపెనీలకే వెళ్తుంది. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా భారత ఎగుమతిదారులకు జరిగిన నష్టానికి అమెరికా ఎలాంటి పరిహారం చెల్లించబోదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ తీర్పుతో అగ్రరాజ్య మార్కెట్‌లో మన ఉత్పత్తులకు మళ్లీ గిరాకీ పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ అమెరికాలో భారత కంపెనీలు ఏమైనా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంటే.. వారికి కొంతమేర లబ్ధి చేకూరనుంది. ఇక, అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని భారత్ పునఃసమీక్షించుకునేందుకు ఈ తీర్పు దోహదపడనుంది.

**రీఫండ్లకు 12-18 నెలల పైనే..**

అయితే, టారిఫ్‌ల సొమ్ము తిరిగి దిగుమతిదారులకు చెల్లించడం అనేది సులువైన ప్రక్రియ కాదు. దీని వల్ల గందరగోళ పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. రీఫండ్‌ల కోసం అమెరికా వద్ద ప్రత్యేక ఆటోమేటిక్ వ్యవస్థ అంటూ ఏదీ లేదు. కంపెనీలే చట్టబద్ధంగా దీనిపై దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని అగ్రరాజ్య మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ఒకవేళ అందుకు కోర్టులు అనుమతినిస్తే.. యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఏజెన్సీ వాటిని సమీక్షించి చెల్లింపులు చేపట్టే అవకాశం ఉంది. అయితే, అది చాలా సుదీర్ఘ ప్రక్రియ. దాదాపు 1218 నెలలు పట్టొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 'రీఫండ్ వ్యాజ్యాలన్నీ పూర్తయ్యేసరికి రెండేళ్లు పట్టొచ్చు' అని ట్రంప్ కూడా విలేకరులతో అన్నారు.

గతంలోనూ ట్రేడ్‌కు సంబంధించిన కేసుల్లో కంపెనీలకు అమెరికా సొమ్ము తిరిగి చెల్లించిన సందర్భాలు ఉన్నాయి. ఎగుమతులపై హార్బర్ మెయింటినెన్స్ ఫీజు రాజ్యాంగవిరుద్ధమని 1990ల్లో పలు కోర్టులు తీర్పునిచ్చాయి. ఆయా ఎగుమతిదారులు చెల్లించిన ఫీజులను రీఫండ్ చేసేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలని న్యాయస్థానాలను ఆదేశించాయి. దానికి అనుగుణంగా యూఎస్ కస్టమ్స్ అధికారులు రీఫండ్ ప్రక్రియ చేపట్టారు. అయితే, ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి ఎన్నడూ రిఫండ్ చేయలేదు. మరి ప్రస్తుత పరిస్థితుల్లో ఈ చెల్లింపులపై అమెరికా ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే..!

## ట్రేడ్ డీల్‌లో మార్పులు..
# భారత్‌పై ఇక 10 శాతం సుంకాలు..!



ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లను అక్కడి సుప్రీంకోర్టు రద్దు చేసింది. దీంతో ఈ తీర్పునకు ముందు భారత్ సహా పలు వాణిజ్య భాగస్వామ్య దేశాలతో అమెరికా కుదుర్చుకున్న ట్రేడ్ డీల్స్ (Trade Deala)లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఆయా దేశాలన్నింటిపైనా ఇక నుంచి 10శాతం సుంకాలు వర్తించనున్నాయని వైట్‌హౌస్ వెల్లడించింది. గతంలో ఇంతకంటే ఎక్కువ టారిఫ్ (Trump Tariffs)లతో వాణిజ్య ఒప్పందాలు కుదిరినప్పటికీ.. కొత్త సుంకాలే వర్తిస్తాయని శ్వేతసౌధం స్పష్టం చేసింది. దీంతో భారత్‌పై టారిఫ్‌లు (Tariffs on India) 18 శాతం నుంచి 10 శాతానికి దిగిరానున్నాయి. టారిఫ్‌లు చెల్లవంటూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ (Donald Trump) ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే ప్రపంచ దేశాలపై 10శాతం సుంకాలు విధిస్తున్నట్లు మళ్లీ ప్రకటన చేశారు. అందుకు సంబంధించిన ఉత్తర్వుల పైనా సంతకం చేశారు. ఈ సుంకాలు ఫిబ్రవరి 24 నుంచి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయని వైట్‌హౌస్ తెలిపింది. 'ఇది తాత్కాలిక ఊరట మాత్రమే. మరింత సముచితమైన లేదా ముందు ఒప్పందం చేసుకున్నవిధంగా సుంకాల రేట్లను అమలుచేయడానికి ఉన్న చట్టపరమైన మార్గాలను మా యంత్రాంగం అన్వేషిస్తోంది" అని శ్వేతసౌధం అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు.

50 నుంచి 10 శాతానికి..

అమెరికా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో భారత్ చేసుకొన్న ట్రేడ్ డీల్ (USIndia Trade Deal)లో మార్పులు జరగనున్నాయి. వాస్తవానికి ట్రంప్ అధికారంలోకి రాగానే అన్ని దేశాలతో పాటు భారత్ పైనా 25శాతం సుంకాలు విధించారు. ఆ తర్వాత రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో మరో 25శాతం అదనపు టారిఫ్‌లు వేశారు. దీంతో మన దేశంపై మొత్తం టారిఫ్‌లు 50శాతానికి పెరిగాయి. ఈ క్రమంలోనే ఇరుదేశాల మధ్య సుదీర్ఘంగా వాణిజ్య చర్చలు జరిగాయి. ఇటీవలే మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి ఫ్రేమ్‌వర్క్ రూపొందించేందుకు రెండు దేశాలు అంగీకారానికి వచ్చాయి. దీంతో భారత్‌పై సుంకాలు 50 శాతం నుంచి 18 శాతానికి దిగొచ్చాయి. ఇప్పుడు సుప్రీం తీర్పుతో ఆ సుంకాలు రద్దు కానున్నాయి. దాని స్థానంలో ట్రంప్ విధించిన తాజా 10శాతం టారిఫ్‌లు 150 రోజుల పాటు అమల్లో ఉండనున్నాయి. ఈ గడువును పొడిగించే అవకాశాలు లేకపోలేదు. అదే సమయంలో మరింత ఎక్కువ సుంకాలను విధించేందుకు కూడా ట్రంప్ సర్కారు ప్రయత్నిస్తోంది.

ఇదిలాఉండగా.. స్విట్జర్లాండ్, దక్షిణ కొరియా, ఐరోపా సమాఖ్య, జపాన్, లిచెన్‌స్టీన్ దేశాలు 15 శాతం టారిఫ్‌లకు అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నాయి. వియత్నాంపై 20శాతం సుంకాలకు ఒప్పందం జరిగింది. ఇప్పుడు సుప్రీం తీర్పుతో ఇవన్నీ 10 శాతానికి తగ్గనున్నాయి.

# ట్రంప్‌నకు చుక్కలు చూపించిన బొమ్మల కంపెనీ..!



ప్రపంచ దేశాలపై విధించిన సుంకాల విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump tariff policy)నకు అమెరికా సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. సుప్రీం తీర్పు వెనక ఒక బొమ్మల కంపెనీ పోరాటం ఉంది. సుంకాల పిడుగుతో మనుగడే కోల్పోయే దశ నుంచి.. అది మళ్లీ ఊపిరి పోసుకుంది.

చైనా నుంచి టాయ్స్..

లెర్నింగ్ రిసోర్సెస్ లిమిటెడ్.. అమెరికా (USA)లో ఇల్లినోయీ కేంద్రంగా వ్యాపారం చేస్తోన్న ఒక బొమ్మల కంపెనీ. తన దిగుమతుల్లో మెజార్టీ వాటా చైనాదే. అక్కడి నుంచి ఎడ్యుకేషన్ టాయ్స్‌ను కొనుగోలు చేస్తోంది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి మిత్ర దేశం, శత్రు దేశం అనే తేడా లేకుండా భారీస్థాయిలో సుంకాలు విధించారు. దాంతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటున్న కంపెనీలకు ఆ విధానాలు శరాఘాతమయ్యాయి.

అలాంటి అయోమయ పరిస్థితుల్లో అధ్యక్షుడి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. లెర్నింగ్ రిసోర్సెస్ యజమాని రిక్ వోల్డెన్‌బర్గ్ గత ఏప్రిల్‌లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరికొందరు పిటిషనర్లతో కలిసి.. ఈ చిన్న సంస్థ (Toy company) విజయం సాధించేవరకు ఏమాత్రం వెనక్కితగ్గకుండా తన న్యాయపోరాటం కొనసాగించింది. ఇప్పుడు ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం చూపే కీలక తీర్పులో భాగమైంది.

డబ్బులు తిరిగిచ్చేయండి..

"ఇన్ని రోజుల ఉత్కంఠకు, ఇబ్బందికి ఈ తీర్పు ఊపిరినిచ్చింది. ఇక, ఈ ప్రభుత్వం నా దగ్గరి నుంచి తీసుకున్న దానికి రికార్డు ఉంది. నా డబ్బులు నాకు తిరిగిఇచ్చేయండి. నేను చేసింది రాజకీయపరమైన పోరాటం కాదు. ఇది పన్నుల గురించి చేసింది. పన్నుల రూపంలో చెల్లించాల్సిన దానికంటే అమెరికన్లు అదనంగా కట్టారు. ఒక దేశం తన ఆదాయాన్ని పెంచుకోవాలంటే.. దానిపై చట్టసభ సభ్యులు చర్చించుకోవాలి" అని తొలి పిటిషన్‌దారుల్లో ఒకరైన వోల్డెన్‌బర్గ్ వెల్లడించారు.

యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ 2025 నివేదిక ప్రకారం.. యూఎస్ దిగుమతిదారుల్లో 97శాతం మంది చిన్న వ్యాపారులే. వారు ఏటా సుమారు 868 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను అమెరికాకు తీసుకువస్తున్నారు. సుంకాలు వాటి మనుగడకు ముప్పు అని ఆ నివేదిక అప్పట్లో ఆందోళన వ్యక్తంచేసింది. కంపెనీలు తమ తయారీ కేంద్రాలను అమెరికాకు మార్చేందుకు ఈ టారిఫ్‌లు దోహదం చేస్తాయని ట్రంప్ ప్రభుత్వం వాదించింది. దీనిపై వోల్డెన్‌బర్గ్ (Rick Woldenberg) స్పందిస్తూ.. వాస్తవాలను విస్మరించారని వ్యాఖ్యానించారు. "చైనాలో బొమ్మల తయారీ కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నిపుణులైన కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాంటి వ్యవస్థను ఇక్కడ ఏర్పాటుచేయడానికి ఏళ్లు పట్టొచ్చు" అని వ్యాఖ్యానించారు.

ట్రంప్ (Donald Trump) ఆదేశాల మేరకు దిగుమతిదారుల నుంచి ఇప్పటివరకు అదనంగా వసూలుచేసిన సుంకాలను ఆయా కంపెనీలకు తిరిగి చెల్లించాలా, వద్దా అనే విషయాన్ని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేయలేదు. అసలు ఆ విషయాన్నే ప్రస్తావించలేదు. అదనపు సుంకాల వసూలును నిలిపివేసినా, వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించాల్సి వచ్చినా ట్రంప్ ప్రభుత్వ ఆదాయం అంచనాలు తలకిందులయ్యే అవకాశం ఉంది.



# మైక్రోసాఫ్ట్ గేమింగ్ సీఈఓగా ఆశా శర్మ

టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ గేమింగ్ (Microsoft Gaming) విభాగంలో భారత సంతతి టెకీకి ఉన్నత పదవి లభించింది. కొత్త సీఈవోగా ఆశా శర్మ (CEO Asha Sharma) ను సంస్థ నియమించింది. ఇప్పటివరకు ఈ స్థానంలో ఉన్న ఫిల్ స్పెన్సర్ పదవీవిరమణ చేయడంతో.. ఆ స్థానంలో గేమింగ్ డివిజన్‌కు సీఈఓ, వైస్ ప్రెసిడెంట్‌గా ఆశా శర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. మైక్రోసాఫ్ట్ గేమింగ్ ఆదాయ వృద్ధి మందగించడం, గేమింగ్ కంటెంట్ కోసం ప్రపంచ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ వంటి సవాళ్లను ఆమె ఎదుర్కోనున్నారు.

మైక్రోసాఫ్ట్‌లో చేరడానికి ముందు ఆశా శర్మ పలు అతిపెద్ద అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీలలో ఉన్నత పదవుల్లో పని చేశారు. గేమింగ్ సీఈఓగా బాధ్యతలు చేపట్టడానికి ముందు మైక్రోసాఫ్ట్‌లోని కృత్రిమ మేధ విభాగంలో సీనియర్ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఆశా శర్మతో పాటు ఇతర సీనియర్ అధికారుల స్థానాల్లోనూ మార్పులు చేసినట్లు టెక్ సంస్థ వెల్లడించింది. గేమ్ స్టూడియోలు, టైటిల్‌లను పర్యవేక్షించే చీఫ్ కంటెంట్ ఆఫీసర్‌గా సీనియర్ అధికారి మాట్ బూటీకి పదోన్నతి కల్పించినట్లు తెలిపింది.

ఆశా శర్మ మిన్నెసోటా విశ్వవిద్యాలయంలోని కార్ల్‌సన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి బిజినెస్‌లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ చేశారు. తన కెరీర్ ప్రారంభంలో ఆశా మైక్రోసాఫ్ట్ మార్కెటింగ్‌లో పని చేసి.. 2013లో సంస్థ నుంచి బయటకు వెళ్లారు. అనంతరం వివిధ అంతర్జాతీయ టెక్ కంపెనీలలో ఉన్నత స్థానాల్లో విధులు నిర్వర్తించారు. రెండేళ్ల క్రితం మైక్రోసాఫ్ట్‌లోని కోర్ ఏఐ విభాగంలో ఉన్నతాధికారిగా తిరిగి చేరారు.

## మహిళల డ్రెస్సింగ్ వివాదం.. మరోసారి స్పందించిన నటుడు శివాజీ



- ఆరోజు మాట్లాడే సమయంలో రెండు పదాలు పొరపాటున దొర్లాయని వెల్లడి
- గతంలోనూ ఇదే విషయం చెప్పానన్న నటుడు శివాజీ
- ఆరోజు అలా ఎందుకు మాట్లాడానో తెలియడం లేదన్న శివాజీ

మహిళల డ్రెస్సింగ్ విషయంలో కొద్ది నెలల క్రితం తాను చేసిన వ్యాఖ్యలపై నటుడు శివాజీ మరోసారి స్పందించారు. మహిళల వేషదారణ విషయంలో ఆ రోజు తాను మాట్లాడిన సమయంలో రెండు పదాలు పొరపాటున దొర్లాయని అన్నారు. అవి వాడకుండా ఉండాల్సిందని తెలిపారు. ఇదే మాటను తాను గతంలో చెప్పానని, ఇప్పుడు కూడా చెబుతున్నానని అన్నారు. నేను ఎప్పుడు కూడా అదుపు తప్పి మాట్లాడలేదని శివాజీ అన్నారు.

అయితే ఆ రోజు అలా ఎందుకు మాట్లాడానో తనకు తెలియడం లేదని వ్యాఖ్యానించారు. అన్ని రోజులు మనవి కాదని మరోసారి అర్థమైందని అన్నారు. ఆ పదాలు ఎందుకు మాట్లాడానా అని నాకే కాస్త ఇబ్బందిగా అనిపించిందని పేర్కొన్నారు. ఆ సమయంలో తాను మానసిక సంఘర్షణకు గురయ్యానని, మూడు రోజులు నిద్ర కూడా పోలేదని గుర్తుచేసుకున్నారు. ఇప్పటి వరకు కొన్ని వందల ప్రెస్ మీట్లు, డిబేట్‌లలో మాట్లాడినా ఎప్పుడూ నోరు జారలేదని పేర్కొన్నారు. ఆరోజు మాత్రం అనుకోకుండా అలా జరిగిపోయిందని అన్నారు.

తాను యాంకర్ అనసూయను కూడా ఏమీ అనలేదని వెల్లడించారు. ఆమెతో తనకు పరిచయం కూడా అంతగా లేదని పేర్కొన్నారు. అనసూయను గతంలో ఎప్పుడో ఒకసారి ఇంటర్వ్యూ చేశానని, అంతకుమించి పెద్దగా పరిచయం లేదని తెలిపారు. ఆమె అంటే తనకు గౌరవం ఉందని తెలిపారు. మగవారు ఎవరు కూడా ఆడవారిని కావాలని ఉద్దేశపూర్వకంగా కించపరచాలని అనుకోరని వ్యాఖ్యానించారు.

తనకు తెలిసిన వాళ్లే మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారని తెలిసి షాకయ్యానని శివాజీ అన్నారు. తనపై ఎవరు ఫిర్యాదు చేశారో తెలుసని, వారి పేర్లు బయటకు చెప్పలేనని, అలా చెప్పడం కరెక్టు కాదని పేర్కొన్నారు. తనపై ఫిర్యాదు చేసినప్పటికీ వారంటే తనకు ఇప్పటికీ గౌరవం ఉందని శివాజీ అన్నారు.



## 47 ఏళ్ల తర్వాత రజనీ-కమల్ మల్టీస్టారర్...

- 'జైలర్' దర్శకుడు నెల్సన్ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్
- విడుదలైన 'KHxRK' ప్రోమో.. రెట్రో లుక్స్‌లో లెజెండ్స్
- 'హీరో ఎవరు?' అనే ప్రశ్నతో ఫ్యాన్స్‌లో క్యూరియాసిటీ
- వచ్చే ఏడాది భారీ స్థాయిలో పాన్ ఇండియా రిలీజ్‌కు సన్నాహాలు

భారత సినీ అభిమానులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కల నిజమైంది. సూపర్‌స్టార్ రజనీకాంత్, ఉలగనాయగన్ కమల్ హాసన్ దాదాపు 47 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కలిసి వెండితెరపై కనిపించబోతున్నారు. 'జైలర్' వంటి బ్లాక్‌బస్టర్‌తో సంచలనం సృష్టించిన దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఈ చారిత్రక ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. 'KHxRK' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా అధికారికంగా ప్రకటించారు.

ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి శుక్రవారం అర్ధరాత్రి 12:07 గంటలకు మేకర్స్ ఓ ప్రోమోను విడుదల చేశారు. దాదాపు 3 నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదలై సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇందులో రజనీ, కమల్ ఇద్దరూ రెట్రో స్టైల్‌లో కనిపించి, తమదైన కామెడీ టైమింగ్, స్టైలిష్ లుక్స్‌తో ఆకట్టుకున్నారు. 'హీరో ఎవరు?' అనే ఆసక్తికరమైన ప్రశ్నతో ఈ ప్రమో ముగియడం అభిమానుల్లో అంచనాలను మరింత పెంచింది.

ఈ చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ నిర్మిస్తుండగా, యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. రాజీవ్ మీనన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించనున్నారు. ఇది హాస్యం, నాస్టాల్జియా, విజువల్స్ మేళవింపుతో కూడిన ఒక వినూత్న ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని ప్రమో స్పష్టం చేస్తోంది.

త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని, వచ్చే ఏడాది చివరికల్లా పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రజనీకాంత్ 'జైలర్ 2', 'తలైవర్ 173' చిత్రాలతో బిజీగా ఉండగా, కమల్ హాసన్ 'కల్కి 2898 AD' సీక్వెల్.. 'అన్బరివు' వంటి ప్రాజెక్టులతో నిమగ్నమై ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరు దిగ్గజాలు కలిసి నటిస్తుండటం భారతీయ సినిమా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.

## ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు
## వరలక్ష్మి శరత్ కుమార్





- డైరెక్టర్ గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన వరలక్ష్మి
- 'సరస్వతి' సినిమాతో దర్శకురాలిగా మారిన వరలక్ష్మి
- గోపీచంద్ మలినేని తనకు లైఫ్ ఇచ్చారని వ్యాఖ్య

తన విలక్షణ నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకున్న నటి వరలక్ష్మి శరత్‌కుమార్. సీనియర్ నటుడు శరత్ కుమార్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి వచ్చిన వరలక్ష్మి... ఆ తర్వాత ఇండస్ట్రీలో తన కాళ్లపై తాను నిలబడింది. ఇప్పుడు దర్శకురాలిగా తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. డైరెక్టర్ గా తన మొదటి చిత్రం 'సరస్వతి'తో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ... "డైరెక్టర్ గోపీచంద్ మలినేని సార్ నా గురువు, మెంటార్, గైడ్. ఆయన కారణంగానే నేను ఈ రోజు ఇక్కడ ఉన్నాను. ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు" అంటూ ఆమె భావోద్వేగానికి గురైంది. ఇండస్ట్రీలో అమ్మాయిలు సర్వైవ్ అవడం చాలా కష్టమని, వారికి సపోర్ట్ ఇవ్వాలని ఆమె కోరింది. కనబడకుండా పోయిన కూతురి కోసం ఒక అమ్మ ఎంత దూరం వెళుతుందో చూపించే కథాంశంతో 'సరస్వతి' తెరకెక్కుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రియమణి, ప్రకాశ్ రాజ్ తదితరులు నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు.దోసా డైరీస్ బ్యానర్ పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

## తప్పొప్పులు చెప్పడం వరకే మన బాధ్యత: మీనా



**అగ్ర హీరోల సినిమాల్లో నటించి మెప్పించిన మీనా ఇప్పుడు వెబ్‌సిరీస్‌లతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు. ఆమె, వినీత్ కీలక పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'రోస్లిన్' (Roslin). ఫిబ్రవరి 27 నుంచి జియో హాట్‌స్టార్ వేదికగా ప్రసారం కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె (Meena) పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.**

"ఒకప్పుడు వరుస సినిమాలతో కుటుంబంతో గడపడానికి సమయం ఉండేది కాదు. పండగకు కూడా ఇంటికి రావడానికి కుదిరేది కాదు. అందరూ ఎంజాయ్ చేస్తుంటే నేను సెట్‌లో ఉండిపోయా అని బాధ పడేదాన్ని. దీపావళి వస్తే క్రాకర్స్ కూడా కాల్చడానికి ఉండేది కాదు. నాకు ఇష్టమైన పండగను చేసుకోవడానికి కుదరట్లేదు అని చాలా ఫీల్ అయ్యేదాన్ని. అప్పుడు మా అమ్మ ఒక మాట చెప్పింది. 'పండగ అందరూ చేసుకుంటారు. కానీ, కొత్త దర్శకులతో, నటీనటులతో గడిపే అవకాశం కొందరికే వస్తుంది. కొత్త ప్రదేశాలు చూడడం, ఎంతోమంది మనుషులతో కలిసి ఉండే అవకాశం రావడం అదృష్టంగా భావించాలి' అని చెప్పింది. అది నిజమే కదా అనిపించింది. అప్పటి నుంచి ప్రతిరోజు ఎంజాయ్ చేయడం నేర్చుకున్నా" అని మీనా అన్నారు.

"ఈ వెబ్‌సిరీస్‌లో నేను తల్లి పాత్ర పోషించాను. నేను అమ్మను అయ్యాక ఆ పాత్ర విలువ మరింత తెలిసింది. ఎమోషనల్ సీన్స్ చేసే సమయంలో ప్రతి డైలాగ్ నాకు కనెక్ట్ అవుతుంది. ఒకప్పటి తరంతో పోలిస్తే ఇప్పటి జనరేషన్‌కు చాలా తేడా ఉంది. ఇప్పటివాళ్లకు ఎన్నో విషయాలపై అవగాహన ఉంది. ఏది చెప్పినా తెలుసు అంటారు. ఏది తప్పు.. ఏది ఒప్పు అని చెప్పడం వరకే మన బాధ్యత" అని చెప్పారు.

## అల్లు అర్జున్ గ్రాండ్ పార్టీ..
## హాజరైన రామ్‌చరణ్ దంపతులు













అల్లు వారింట పెళ్లి సందడి మొదలైంది. అల్లు శిరీష్‌నయనికల వివాహం మార్చి 6న జరగనుంది. ఇప్పటికే పెళ్లి పనులు షురూ కాగా.. తాజాగా అల్లు అర్జున్ (Allu Arjun) తన నివాసంలో గ్రాండ్ పార్టీ ఏర్పాటుచేశారు. ఈ పార్టీకి రామ్ చరణ్ (Ram Charan) దంపతులతో పాటు టాలీవుడ్‌లోని పలువురు సెలబ్రిటీలు హాజరయ్యారు. ప్రస్తుతం ఈ పార్టీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవలే దుబాయ్‌లో బ్యాచిలర్ పార్టీ కూడా జరిగింది. అందులో ఫ్రెండ్స్ సందడి చేయగా తాజాగా కుటుంబసభ్యులు, టాలీవుడ్‌లోని స్నేహితుల కోసం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. అల్లు శిరీష్‌కు తన ప్రియురాలు నయనికతో గతేడాది అక్టోబర్‌లో నిశ్చితార్థం జరిగింది. వీరి వివాహం కోసం పెళ్లి పిలుపులు ప్రారంభించారు (Allu Sirish Wedding Date). ఇటీవలే తొలి శుభలేఖను శిరీష్.. తన మావయ్య, అగ్ర కథానాయకుడు చిరంజీవికి అందించి ఆశీర్వాదం తీసుకున్నారు.

## ఒకరోజు ముందే శ్రీవిష్ణు 'విష్ణు విన్యాసం'... రిలీజ్ డేట్ మార్పు

- ఫిబ్రవరి 27నే థియేటర్లలోకి 'విష్ణు విన్యాసం'
- మరో సినిమా 'మృత్యుంజయ్' వాయిదా పడటంతో మారిన విడుదల తేదీ
- ఫన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న చిత్రం
- యదునాథ్ మారుతి రావు దర్శకత్వం
- హీరోయిన్ గా నయన్ సారిక




యంగ్ హీరో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా 'విష్ణు విన్యాసం' విడుదల తేదీ మారింది. ముందుగా ప్రకటించిన దానికంటే ఒక రోజు ముందే ఈ ఫన్ ఎంటర్‌టైనర్‌ను థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఫిబ్రవరి 28న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని, ఇప్పుడు ఫిబ్రవరి 27, శుక్రవారం నాడు రిలీజ్ చేయనున్నారు.

నిజానికి ఫిబ్రవరి 27న శ్రీవిష్ణు నటించిన మరో సినిమా 'మృత్యుంజయ' విడుదల కావాల్సి ఉంది. అయితే, ఆ క్రైమ్ థ్రిల్లర్ వాయిదా పడటంతో ఆ తేదీ ఖాళీ అయింది. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ, బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ రాబట్టేందుకు 'విష్ణు విన్యాసం' చిత్రాన్ని ఒకరోజు ముందుకు జరిపారు.

ఈ విషయాన్ని హీరో శ్రీవిష్ణు తన సోషల్ మీడియాలో సరదాగా ప్రకటించారు. "జాతకం ప్రకారం... ఈ 27th FEBRUARY నుంచి థియేటర్లలో నవ్వుల వర్షం కురుస్తుంది. మీ జాతకంలో "NonStop Fun Dosham" మొదలవుతుంది" అంటూ ఫన్నీ పోస్ట్ పెట్టారు. యదునాథ్ మారుతి రావు దర్శకత్వం వహిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో శ్రీవిష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు. మూఢనమ్మకాలు, జాతకాలను ఎక్కువగా నమ్మే యువకుడిగా శ్రీవిష్ణు పాత్ర ఆసక్తికరంగా ఉండనుంది. ఈ చిత్రంలో సత్య, మురళీ శర్మ, బ్రహ్మాజీ ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, రాధన్ సంగీతం అందిస్తున్నారు. ఫిబ్రవరి 25న యూఎస్‌లో ప్రీమియర్ షోలు కూడా ప్రదర్శించనున్నారు.

## కట్ చెప్పగానే వాళ్లిద్దరూ ఏడ్చేశారు: మాధవన్



ఇండస్ట్రీలో రికార్డులు సృష్టించిన చిత్రం 'ధురంధర్'. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో ఆర్ మాధవన్ భారత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ అజయ్ సన్యాల్ పాత్రలో నటించి ఆకట్టుకున్నారు. తాజాగా ఆయన ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఆ సినిమాలో ముంబయి ఉగ్రదాడి సన్నివేశం షూటింగ్ చేశాక అక్షయ్ ఖన్నా(Akshaye Khanna), అర్జున్ రాంపాల్ ఇద్దరూ ఏడ్చినట్లు వెల్లడించారు.

ఈ చిత్రంలో కరాచీని అడ్డాగా చేసుకుని ఉగ్రవాద మూఠాల్ని పెంచి పోషిస్తున్న రెహమాన్ బలోచ్ అనే పాత్రలో అక్షయ్ ఖన్నా.. పాకిస్థాన్ మేజర్ పాత్రలో అర్జున్ రాంపాల్ (Arjun Rampal) నటించారు. వీరిద్దరూ ముంబయి ఉగ్రదాడుల సన్నివేశంలో నటించే సమయంలో తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు మాధవన్ తెలిపారు. దర్శకుడు ఆ సీన్‌కు కట్ చెప్పగానే వీరిద్దరూ ఏడ్చేశారని చెప్పారు. అలాంటి పాత్రలు పోషించడం చాలా కష్టమని ఆ ప్రభావం వారిపై కొన్ని రోజుల పాటు ఉందన్నారు. ముఖ్యంగా ఇలాంటి దాడుల సన్నివేశాల్లో నటించినప్పుడు ఆ దృశ్యాలు చూసి భావోద్వేగాలను అదుపు చేసుకోవడం అసాధ్యమన్నారు.

**'ధురంధర్ 2' ట్రైలర్ అప్‌డేట్!**

'ధురంధర్' ఘన విజయం సాధించడంతో దీని సీక్వెల్‌పై అంచనాలు నెలకొన్నాయి. తాజాగా దీని పార్ట్2కు సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మార్చి 5న 'ధురంధర్ 2' ట్రైలర్ రానున్నట్లు సమాచారం. దీనికోసం భారీ ఈవెంట్ నిర్వహించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల నెలకొన్న కొన్ని పరిస్థితుల దృష్ట్యా ఈ సినిమా షూటింగ్ ఆలస్యమవుతుందని, విడుదల కూడా ఆలస్యమవుతుందంటూ వచ్చిన వార్తలకు చెక్ పెడుతూ ఈ ఈవెంట్‌ను భారీగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మార్చి 19న 'ధురంధర్ 2' విడుదల కానుంది.

## బెంగళూరులో ఏఎంబీ సినిమాస్... డాల్బీ విజన్ ఆస్వాదించిన మహేశ్ బాబు



- బెంగళూరులో కొత్తగా ప్రారంభమైన ఏఎంబీ సినిమాస్‌ను సందర్శించిన మహేశ్ బాబు
- దక్షిణ భారతదేశంలోనే తొలి డాల్బీ విజన్ థియేటర్‌గా తమ మల్టీప్లెక్స్ రికార్డు
- అభిమానులు చూపిన ప్రేమకు కృతజ్ఞతలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్
- తమ కలలను సాకారం చేస్తున్న ఏఎంబీ బృందాన్ని చూసి గర్వంగా ఉందన్న మహేశ్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు ఇటీవల బెంగళూరులో పర్యటించారు. అక్కడ కొత్తగా ప్రారంభమైన తమ ఏఎంబీ సినిమాస్ మల్టీప్లెక్స్‌ను ఆయన సందర్శించారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా డాల్బీ విజన్ టెక్నాలజీతో ఏర్పాటైన ఈ థియేటర్‌లో సినిమా చూసి అద్భుతమైన అనుభూతిని పొందానని వెల్లడించారు. ఈ సందర్భంగా తనపై అభిమానులు చూపిన ప్రేమకు ముగ్ధుడైన మహేశ్, తన సంతోషాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు.

"సౌత్ ఇండియాలోనే మొదటి డాల్బీ విజన్‌ను మా ఏఎంబీ సినిమాస్ బెంగళూరులో అనుభవించడం చాలా ప్రత్యేకంగా అనిపించింది. నన్ను చూడటానికి ఎంతో దూరం నుంచి వచ్చిన అభిమానులను కలవడం కూడా అంతే సంతోషాన్నిచ్చింది. బెంగళూరు చూపిన ఈ ప్రేమకు నేను వినమ్రుడినయ్యాను. గాలి నిండా ప్రేమే నిండిపోయింది" అని మహేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

అదేవిధంగా, తమ కలలను సాకారం చేయడానికి అహర్నిశలు శ్రమించిన ఏఎంబీ సినిమాస్ బృందాన్ని చూసి గర్వంగా ఉందని ప్రశంసించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఏఎంబీ సినిమాస్ విజయవంతంగా నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు బెంగళూరులోనూ తమ బ్రాంచ్‌ను విస్తరించడం ద్వారా మహేశ్ బాబు వ్యాపార రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ పర్యటనకు సంబంధించిన ఫొటోలు, మహేశ్ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్

## గర్భవతిగానే సినిమా చేశా: లావణ్య త్రిపాఠి

- మార్చి 6న విడుదలవుతున్న 'సతీ లీలావతి'
- ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషించిన లావణ్య త్రిపాఠి
- సినిమా మొదలైన తర్వాత తనకు ప్రెగ్నెన్సీ అని తెలిసిందని వెల్లడి



మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో యాక్టివ్‌గా కొనసాగుతోంది. ఇటీవలే ఆమె పండంటి బాబుకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఆమె ప్రధాన పాత్ర పోషించిన 'సతీ లీలావతి' మార్చి 6న విడుదలకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమోషన్స్‌లో భాగంగా యాంకర్ సుమ కనకాలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో లావణ్య తన ప్రెగ్నెన్సీ సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకుంది. "ఈ సినిమా పనులు మొదలైన తర్వాత నాకు ప్రెగ్నెన్సీ అని తెలిసింది. సినిమాకు 'నో' చెబితే నిర్మాతలకు నష్టం అవుతుందని భావించాను. అందుకే గర్భవతిగానే షూటింగ్ చేశాను. వాంతులు అయ్యాక కూడా సెట్‌కి వెళ్లేదాన్ని. మైగ్రేన్ వచ్చినప్పుడు టాబ్లెట్స్ వేసుకుని షూట్ చేసేదాన్ని" అని లావణ్య వెల్లడించింది. యాక్షన్ సన్నివేశాలు చేయాల్సి వచ్చినప్పుడు ఎంతో భయం వేసేదని, ప్రతి షెడ్యూల్ ముగిసిన తర్వాత ఆసుపత్రికి వెళ్లి చెకప్ చేయించుకునేదాన్నని చెప్పింది. మూడు నెలల్లోపే షూటింగ్ పూర్తి చేసేలా ప్లాన్ చేశారని తెలిపింది. డ్యాన్స్ సీక్వెన్స్ సమయంలో కూడా భయం వేసిందని, కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ తన పరిస్థితిని అర్థం చేసుకుని స్టెప్స్ సర్దుబాటు చేశారని చెప్పింది. బేబీ బంప్ కనిపించకుండా కాస్ట్యూమ్స్ లూజ్‌గా డిజైన్ చేయించారని వెల్లడించింది. నాలుగో నెలలో కొన్ని సన్నివేశాలు ప్యాచ్‌వర్క్ చేయాల్సి వచ్చిందని తెలిపింది. ఇంట్లోవాళ్లు మొదట భయపడినా, చివరికి పూర్తి సపోర్ట్ ఇచ్చారని, ముఖ్యంగా భర్త వరుణ్ చాలా అండగా నిలిచారని లావణ్య చెప్పింది. డాక్టర్లు ఎక్కువ ప్రయాణాలు చేయొద్దని చెప్పారని... అయితే, షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగేది కాబట్టి పొద్దున్నే లేచి వెళ్లడం కష్టంగా అనిపించేదని తెలిపారు. "ప్రెగ్నెన్సీ విషయం షూటింగ్ టీమ్‌కు మొదట్లో తెలియదు. తెలిస్తే ప్రత్యేకంగా చూస్తారేమోనని భయంతో చెప్పలేదు" అని ఆమె వెల్లడించింది.

## నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా
# సిరాజ్‌కు గాయం!



- సూపర్ 8 పోరుకు ముందు గాయపడ్డ కీలక బౌలర్
- హార్దిక్ పాండ్యా కొట్టిన షాట్ తో సిరాజ్ మోకాలికి తాకిన బంతి
- ఆదివారం దక్షిణాఫ్రికాతో తలపడనున్న టీమిండియా

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆదివారం దక్షిణాఫ్రికాతో జరగనున్న కీలకమైన సూపర్ 8 పోరుకు ముందు భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ శుక్రవారం సాయంత్రం నెట్స్ ప్రాక్టీస్ సమయంలో గాయపడ్డాడు. నరేంద్ర మోదీ స్టేడియంలో ప్రాక్టీస్ సెషన్ జరుగుతుండగా హార్దిక్ పాండ్యా కొట్టిన బంతి నేరుగా వెళ్లి సిరాజ్ ఎడమ మోకాలికి తగిలింది. దీంతో అతను తీవ్రమైన నొప్పితో విలవిల్లాడిపోయాడు. వెంటనే రంగంలోకి దిగిన ఫిజియోలు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ, నొప్పి తగ్గకపోవడంతో సిరాజ్ నెట్స్ నుంచి వెళ్లిపోయాడు.

**టోర్నీలో సిరాజ్ నాటకీయ ప్రయాణం..**
ఈ మెగా టోర్నీలో సిరాజ్ ప్రయాణం మొదటి నుంచీ నాటకీయంగా సాగుతోంది. వార్మప్ మ్యాచ్ లో హర్షిత్ రాణా గాయపడటంతో చివరి నిమిషంలో సిరాజ్ జట్టులోకి వచ్చాడు. జస్ప్రీత్ బుమ్రా అనారోగ్యం కారణంగా అమెరికాతో జరిగిన మ్యాచ్ లో తుది జట్టులో చోటు దక్కించుకున్న సిరాజ్.. ఆ మ్యాచ్ లో అద్భుత ప్రదర్శన చేశాడు. 3 వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

**అభిమానుల్లో ఆందోళన**
సూపర్ 8 వంటి కీలక దశకు ముందు నిలకడగా రాణిస్తున్న బౌలర్ గాయపడటం అభిమానులను కలవరానికి గురిచేస్తోంది. దక్షిణాఫ్రికాతో జరగబోయే హైవోల్టేజ్ మ్యాచ్‌కు సిరాజ్ అందుబాటులో ఉంటాడా? లేదా? అన్నది ప్రస్తుతం సస్పెన్స్ గా మారింది. దీనిపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# అంధుల క్రికెట్‌కు అండగా..
# బీసీసీఐ కీలక నిర్ణయం



ఇటీవలి కాలంలో అంధుల క్రికెట్‌లోనూ టీమ్ఇండియా ప్లేయర్లు అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఇటు పురుషుల జట్టుతోపాటు మహిళా జట్టు వరల్డ్ కప్‌లను గెలిచి సత్తాచాటారు. అయితే, వారికి అందే అరకొర సాయంతోనే ఇన్నాళ్లూ నెట్టుకొచ్చారు. ఏదైనా టోర్నీలో విజేతగా నిలిస్తేనే ఆ ప్లేయర్లకు నగదు అందుతోంది. దీంతో కొందరు ఉద్యోగాలు చేసుకుంటూనే మ్యాచులకు సిద్ధం కావాల్సిన పరిస్థితి ఉంది. ఇక నుంచి ఆ కష్టాల నుంచి భారత అంధుల క్రికెట్ బయటపడబోతోంది. దానికి కారణం ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డు బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. మెరుగైన అవకాశాలు కల్పించడం, క్రికెట్ వృద్ధి కోసం సాయం చేసేందుకు ముందుకొచ్చింది. ప్రస్తుత ఐసీసీ ఛైర్మన్ జైషా బీసీసీఐ సెక్రటరీగా ఉన్నప్పుడే ఈ విధానానికి శ్రీకారం చుట్టారు.

**బీసీసీఐ సాయం ఇలా..** విదేశాల్లో రెండు అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనేందుకు అవసరమైన ప్రయాణ సదుపాయాలను కల్పించడం స్వదేశం వేదికగా జరిగే ద్వైపాక్షిక సిరీసుల్లో పాల్గొనే భారత్, పర్యాటక ప్లేయర్లకు వసతి సదుపాయం బీసీసీఐకి సంబంధించిన వేదికలను వాడుకొనేందుకు అవకాశం. దేశవాళీ, అంతర్జాతీయ మ్యాచులు ఆడే సదుపాయం. ఆటకు సంబంధించి అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన పరిస్థితులను కల్పించడం.

**అద్భుతాలు సాధిస్తున్నారు: మిథున్ మన్హాస్**
''దృష్టిలోపం ఉన్నప్పటికీ క్రికెట్‌లో తమ సత్తా ఏంటో ప్రపంచానికి చాటిచెప్పారు. వారి విజయాలు భారత క్రికెట్‌కు ఎంతో గర్వకారణం. అసోసియేషన్‌ను బలోపేతం చేయడం వల్ల అథ్లెట్లకు మెరుగైన అవకాశాలు దక్కుతాయి. అత్యుత్తమ మౌలిక సదుపాయాలను కల్పించడం, ప్లేయర్లకు గుర్తింపును అందించడమే బీసీసీఐ లక్ష్యం. ఈ మద్దతుతో చాలా మంది క్రికెట్‌ను కెరీర్‌గా తీసుకోవడానికి స్ఫూర్తి ఇస్తుందని ఆశిస్తున్నాం'' అని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ వెల్లడించారు.

**మా సహకారం కొనసాగిస్తాం: దేవజిత్ సైకియా...**
''అంధుల క్రికెట్ విస్తరణ కోసం మా సహకారం ఎల్లవేళలా ఉంటుంది. క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా (CABI) బలోపేతం కోసం కృషి చేస్తాం. సదుపాయాలు, అవసరమైన చేయూత అందిస్తాం. దీని వల్ల దేశవిదేశాల్లో మన క్రికెటర్లు ఆత్మవిశ్వాసంతో ఆడేందుకు ఆస్కారం కలుగుతుంది'' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు.

## ఐదేళ్లలో చొరబాటుదారులను దేశం నుంచి తరిమేస్తాం



రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ''చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు'' అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు. రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

# ఏడాది కాలంగా అతడు మాకు అండగా నిలిచాడు...

- టీ20 ప్రపంచకప్‌లో పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న అభిషేక్ శర్మ
- అతడికి పూర్తి మద్దతు ప్రకటించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్
- అభిషేక్ స్థానంపై ఎలాంటి చర్చ లేదని స్పష్టం చేసిన బౌలింగ్ కోచ్
- సూపర్ 8లో భాగంగా దక్షిణాఫ్రికాతో తలపడనున్న టీమిండియా

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా దక్షిణాఫ్రికాతో కీలకమైన సూపర్ 8 మ్యాచ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో, పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న యువ ఓపెనర్ అభిషేక్ శర్మకు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పూర్తి మద్దతు ప్రకటించాడు. అభిషేక్ ఫామ్ గురించి జట్టు యాజమాన్యం ఏమాత్రం ఆందోళన చెందడం లేదని, త్వరలోనే అతను ఫామ్‌లోకి వస్తాడని ధీమా వ్యక్తం చేశాడు.

ఆదివారం జరగనున్న మ్యాచ్‌కు ముందు విలేకరులతో మాట్లాడిన సూర్యకుమార్.. "అభిషేక్ ఫామ్ గురించి ఎవరైతే ఆందోళన చెందుతున్నారో, వాళ్లను చూస్తేనే నాకు ఆందోళనగా ఉంది. అతను ఇంకా పరుగులు చేయలేదంటే, తర్వాతి మ్యాచ్‌లలో ప్రత్యర్థి జట్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి" అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "ఇది టీమ్ గేమ్. ఏడాది కాలంగా మా అందరి బాధ్యత తను తీసుకున్నాడు, ఇప్పుడు మేము తన కోసం నిలబడతాం. ఒకవేళ అతను విఫలమైతే, ఆ లోటును భర్తీ చేయడానికి మేమున్నాం" అని స్పష్టం చేశాడు.

ఈ టోర్నమెంట్‌లో అభిషేక్ శర్మ ఇప్పటివరకు ఖాతా తెరవలేదు. అమెరికాపై గోల్డెన్ డక్‌గా వెనుదిరగ్గా, పాకిస్థాన్, నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లలోనూ తొలి రెండు ఓవర్లలోపే వికెట్ కోల్పోయాడు.

అంతకుముందు, భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా అభిషేక్‌కు అండగా నిలిచాడు. "అతను ప్రపంచ స్థాయి ఆటగాడు. జట్టులో అతని స్థానంపై ఎలాంటి చర్చ జరగడం లేదు. నెట్స్‌లో బంతిని చక్కగా ఆడుతున్నాడు. త్వరలోనే అతను జట్టుకు అవసరమైన పరుగులు చేస్తాడు" అని మోర్కెల్ తెలిపాడు. 2024 ప్రపంచకప్ రన్నరప్ అయిన దక్షిణాఫ్రికాపై అభిషేక్‌కు మంచి రికార్డు ఉంది. ఆ జట్టుతో 8 మ్యాచ్‌లు ఆడి ఒక హాఫ్ సెంచరీతో సహా 200 పరుగులు చేశాడు.



## భారత్ సెమీస్ చేరదు:
## పాక్ మాజీ బౌలర్ మొహమ్మద్ ఆమిర్



- సూపర్ 8లో భారత్ తేలిపోతుందన్న మహమ్మద్ ఆమిర్
- భారత్ సెమీస్ దాకా రావడం అసాధ్యమని వ్యాఖ్య
- సూపర్ 8లో జింబాబ్వే లాంటి డేంజర్ జట్లు ఉన్నాయన్న ఆమిర్

పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ భారత జట్టు ప్రదర్శనపై తీవ్ర విమర్శలు చేశాడు. గ్రూప్ దశలో భారత్ అద్భుతంగా రాణించినా... సూపర్ 8లో తేలిపోతుందని, సెమీ ఫైనల్ దాకా రావడం అసాధ్యమని హేళన చేశాడు. గ్రూప్ దశలో పాకిస్థాన్‌పై మాత్రమే భారత బ్యాటర్లు బాగా ఆడారని చెప్పాడు. యూఎస్ఏ, నమీబియా, నెదర్లాండ్స్ లాంటి చిన్ని జట్లపై ఒకరిద్దరు మాత్రమే రాణించారని అన్నాడు. పసికూన జట్లపై గెలవడాన్ని గొప్పగా భావించకూడదని చెప్పాడు.
సూపర్ 8లో జింబాబ్వే లాంటి డేంజర్ జట్లు ఉన్నాయని... భారత్ ఇక్కడే ఓడిపోతుందని ఆమిర్ అన్నాడు. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ సెమీ ఫైనల్ దాకా వస్తాయని, భారత్ మాత్రం సెమీ ఫైనల్ చేరదని చెప్పాడు.
నేటి నుంచి సూపర్ 8 మ్యాచ్‌లు మొదలవుతున్నాయి. ఈరోజు మొదటి మ్యాచ్ న్యూజిలాండ్ పాకిస్థాన్ మధ్య జరగనుంది. భారత్ తన తొలి మ్యాచ్ రేపు దక్షిణాఫ్రికాతో ఆడనుంది. ఆ తర్వాత జింబాబ్వే, వెస్టిండీస్‌తో కూడా మ్యాచ్‌లు ఉన్నాయి.

## అందులో మార్పు ఉండబోదు..
## ఒత్తిడి చెందడం ఎప్పుడో ఆపేశా: అభిషేక్

ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్.. అత్యంత డేంజరస్ ఓపెనర్ అనే ట్యాగ్‌లైన్లతో అభిషేక్ శర్మ (Abhishek Sharma) టీ20 ప్రపంచ కప్‌లోకి అడుగు పెట్టాడు. తాను ఆడిన మూడు మ్యాచుల్లోనూ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో సంజు శాంసన్‌ను తీసుకొంటే బాగుండేదన్న వ్యాఖ్యలు.. అభిషేక్ శర్మ స్పిన్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బందిపడుతున్నాడనే విమర్శలూ వచ్చాయి. కానీ, మేనేజ్‌మెంట్‌తోపాటు కెప్టెన్ సూర్య మాత్రం అభిషేక్‌పై నమ్మకం ఉంచారు. తప్పకుండా ఫామ్‌లోకి వస్తాడని చెప్పారు. ఈ క్రమంలో తాను డకౌట్‌లు కావడంపై అభిషేక్ శర్మ స్పందించాడు. తన దూకుడైన స్వభావాన్ని మార్చుకొనేది లేదని స్పష్టం చేశాడు. ఆ వీడియోను స్టార్‌స్పోర్ట్స్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది.
''నేను బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తాను. అంతకంటే మరేం చేయను. ఒత్తిడికి గురి కావడమనేది ఎప్పుడో రెండేళ్ల కిందటే వదిలేశా. కేవలం సన్నద్ధతను మాత్రమే నమ్ముతా. మన చేతుల్లో ఉండేది అదే. ఎక్కువగా సాధన చేయడం అందులో ముఖ్యం. ఇప్పుడు అదే చేస్తున్నా. నా ఆట తీరును, మైండ్‌సెట్‌ను మార్చుకోను. నాపై నాకు నమ్మకం ఉంది. బ్యాటర్‌గా ఎవరి కెరీర్‌లోనైనా ఇలాంటి ఒడిదొడుకులు సహజమే. కొన్ని ఇన్నింగ్స్‌ల్లో



స్కోరు చేస్తుంటాం. మరికొన్నింట్లో పరుగులు చేయలేకపోవచ్చు. కానీ, వ్యక్తిగతంగా మాత్రం దూకుడైన ఆటతీరునే ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తా. అప్పుడప్పుడు అనుకొన్న ఫలితాలను ఇవ్వకపోవచ్చు. అయితే, నేను మాత్రం అందులో ఎలాంటి మార్పులు చేయబోను. అవసరమైతే మరింత సాధన చేసి అదే దూకుడు కొనసాగిస్తా'' అని అభిషేక్ వెల్లడించాడు.

# గత ఫైనలిస్టుల సమరం..
# రేపు సఫారీలతో టీమిండియా అమీతుమీ

- సూపర్-8లో దక్షిణాఫ్రికాతో భారత్ తొలి మ్యాచ్
- గత టీ20 ప్రపంచకప్ ఫైనలిస్టుల మధ్య మరో పోరు
- అహ్మదాబాద్ వేదికగా ఆదివారం జరగనున్న మ్యాచ్
- రికార్డుల్లో టీమిండియాదే స్పష్టమైన ఆధిక్యం
- నాకౌట్ మ్యాచుల్లో భారత్‌పై సఫారీలకు ఓటమి చరిత్ర

టీ20 ప్రపంచకప్ 2026లో అసలు సిసలు సమరానికి రంగం సిద్ధమైంది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్.. సూపర్ 8 రౌండ్‌లో తన తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. 2024 ప్రపంచకప్ ఫైనల్లో పోటీపడిన ఈ రెండు జట్ల మధ్య ఆదివారం (ఫిబ్రవరి 22) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఈ హైవోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌తో ఇరు జట్లు తమ సూపర్ 8 ప్రస్థానాన్ని ప్రారంభించనున్నాయి. సూపర్ 8లో భారత్, దక్షిణాఫ్రికాలతో పాటు గ్రూప్‌ఎలో రెండుసార్లు ఛాంపియన్ వెస్టిండీస్, జింబాబ్వే ఉన్నాయి. తొలి రౌండ్‌లో ఈ నాలుగు జట్లు కూడా తమ తమ గ్రూపుల్లో టాపర్లుగా నిలిచి సూపర్ 8కు అర్హత సాధించాయి. దీంతో ఈ గ్రూపును కఠినమైనదిగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు భారత్, దక్షిణాఫ్రికా జట్లు పొట్టి ఫార్మాట్‌లో 35 సార్లు ముఖాముఖి తలపడ్డాయి. భారత జట్టు 21 మ్యాచ్‌లలో విజయం సాధించి స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. దక్షిణాఫ్రికా కేవలం 13 విజయాలతో సరిపెట్టుకుంది. మరో మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. టీ20 ప్రపంచకప్ టోర్నీల్లోనూ భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఈ మెగా టోర్నీలో ఇరుజట్లు ఏడుసార్లు పోటీపడగా.. భారత్ ఐదు మ్యాచ్‌లలో గెలుపొందింది. ప్రొటియాస్ జట్టు కేవలం రెండు విజయాలు మాత్రమే నమోదు చేయగలిగింది. అంతేకాదు, టీ20 ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో భారత్‌ను ఓడించిన చరిత్ర దక్షిణాఫ్రికాకు లేదు. 2014 సెమీఫైనల్, చారిత్రాత్మక 2024 ఫైనల్‌లో భారత్ చేతిలో సఫారీ జట్టు ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాపై భారత్‌కు మానసికంగా కూడా పైచేయి ఉంది. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ భారత్ 31 తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. తాజా ఫామ్ చూస్తే, భారత్ తన చివరి ఐదు మ్యాచ్‌లలోనూ అజేయంగా నిలవగా.. దక్షిణాఫ్రికా ఒక ఓటమిని చవిచూసింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలోని భారత జట్టులో ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్య, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్ వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు. మరోవైపు, ఐడెన్ మార్‌క్రమ్ సారథ్యంలోని సఫారీ జట్టులో క్వింటన్ డి కాక్, కగిసో రబాడ, డేవిడ్ మిల్లర్ వంటి మ్యాచ్ విన్నర్లు ఉన్నారు. గణాంకాలు, ఇటీవలి ఫామ్ పరంగా భారత్ స్పష్టమైన ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుండగా, తమపై ఉన్న నాకౌట్ ముద్రను చెరిపేసుకోవాలని సఫారీలు పట్టుదలగా ఉన్నారు. దీంతో ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




## మళ్లీ పెళ్లి చేసుకున్న శిఖర్ ధావన్

- టీమిండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ రెండో వివాహం
- స్నేహితురాలు సోఫీ షైన్‌ను పెళ్లి చేసుకున్న గబ్బర్
- పెళ్లి ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్న యుజ్వేంద్ర చాహల్
- 2024 ఆగస్టులో అంతర్జాతీయ క్రికెట్‌కు ధావన్ వీడ్కోలు

గతంలో మొదటి భార్య అయేషా ముఖర్జీతో విడాకులు టీమిండియా మాజీ డ్యాషింగ్ ఓపెనర్ శిఖర్ ధావన్ రెండోసారి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాడు. తన స్నేహితురాలు సోఫీ షైన్‌ను వివాహమాడాడు. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య శనివారం ఈ పెళ్లి వేడుక జరిగినట్లు తెలుస్తోంది. భారత స్పిన్నర్, ధావన్ స్నేహితుడు యుజ్వేంద్ర చాహల్ ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వరుడి సంప్రదాయ దుస్తుల్లో ఉన్న ధావన్, వధువుగా ముస్తాబైన సోఫీతో కలిసి దిగిన ఫొటోలను చాహల్ షేర్ చేశాడు. "మేరే యార్ కీ షాదీ హై" (నా స్నేహితుడి పెళ్లి) అనే క్యాప్షన్‌తో తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. వేడుకలో ఇతర అతిథులతో కలిసి చాహల్ డ్యాన్స్ చేస్తూ సందడి చేస్తున్న దృశ్యాలు కూడా ఈ ఫొటోల్లో ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ధావన్, సోఫీ.. 2025లో తమ సంబంధాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది జనవరిలో వీరి నిశ్చితార్థం జరిగింది. సోషల్ మీడియాలో ఈ జంట చేసే సరదా రీల్స్‌కు అభిమానుల్లో మంచి ఆదరణ ఉంది. ఇటీవలే ధావన్ తన సంగీత్ కార్యక్రమ ఫొటోలను, సోఫీ తన హల్దీ వేడుక ఫొటోలను పంచుకున్నాడు. ధావన్‌కు ఇది రెండో వివాహం. మొదటి భార్య అయేషా ముఖర్జీతో 2021లో విడాకులు తీసుకున్నాడు. 2024 ఆగస్టు



24న ధావన్ అన్ని రకాల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన కెరీర్‌లో 269 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 24 సెంచరీలతో 10,867 పరుగులు సాధించాడు. ఐసీసీ టోర్నమెంట్లలో నిలకడగా రాణించడంతో అతనికి 'మిస్టర్ ఐసీసీ' అనే పేరుంది.